నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శుక్రవారం | జూన్ 28, 2024 | www.navatelangana.com

యూనియన్ బ్యాంకులో దళారుల రాజ్యం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండలంలోని యూనియన్ బ్యాంకుల్లో దళారుల రాజ్యం కొనసాగుతోందని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షులు సంగేపు బొర్రన్న ఆరోపించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంట రుణాల కోసం బారులు తీరుతున్నారు. రైతులు గత సంవత్సరం తీసుకున్న రుణాలను రిషెడ్యూల్ కోసం దళారులు లక్షకు రూ.2, 3 వేల వరకు వడ్డీని వసూలు చేస్తున్నారన్నారు. రుణం కోసం సమర్పించిన డాక్యుమెంట్లు కదలాలన్న దళారులు చెప్పితే కానీ ముందుకు కదలని పరిస్థితి ఉందన్నారు. వీరికి బ్యాంకులో పని చేసే కొందరు కింది స్థాయి సిబ్బంది సహకరిస్తున్నట్లు ఆరోపించారు. ఏజెన్సీలోని గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ఇబ్బందులకు గురి చేస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లాలోని ట్రాన్స్ జెండర్లకు కలెక్టర్ రాజర్షి షా ట్రాన్స్ జెండర్ గుర్తింపు కార్డు, సర్టిఫికెట్ పంపిణీ చేశారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్ జెండర్స్ గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్ జెండర్ సమాజంలో గుర్తింపు కోసం వారి హక్కుల పరిరక్షణకై ఐడి కార్డు, ధృవీకరణ పత్రాలు కలెక్టర్ చేతుల మీదుగా 8 మందికి అందజేశారు. అనంతరం కలెక్టర్‌ను వారు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సబితా, ఏసీడీపీఓ మిల్కా, కార్యాలయ సిబ్బంది, ట్రాన్స్ జెండర్ సభ్యులు పాల్గొన్నారు.

కాసుపత్రులు..!

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రయివేటు ఆసుపత్రులు
- బోర్డులపై కనిపించని ఫీజుల వివరాలు
- అక్కడే టెస్టులు.. మందుల కొనుగోలు
- ఆధునిక వైద్యం పేరిట అధికంగా వసూలు
- ధనార్జనే ధ్యేయంగా కొన్ని ఆస్పత్రుల వ్యవహారం
- తెలిసినా మామూలుగా తీసుకుంటున్న అధికారులు

ఉమ్మడి జిల్లాలో కొన్ని ప్రయివేటు ఆస్పత్రులు కాసుపత్రులుగా మారుతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నాయి. ఆస్పత్రుల్లో అడుగు పెడితే పైసలు అన్నట్లుగా మారింది. గతంలో అక్కడక్కడ కనిపించే ప్రయివేటు ఆస్పతులు ప్రస్తుతం ఎక్కడపడితే అక్కడ పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. తక్కువ ఫీజులతో సేవలందిస్తామని అనుమతులు తీసుకొని అడ్డదిడ్డంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఆయా చికిత్సలకు రోగుల నుంచి వసూలు చేస్తున్న ఫీజులు(బిల్లులు)ను ఆస్పత్రిలో బోర్డుపై ప్రదర్శించాల్సి ఉన్నా అలాంటివేమీ పెట్టడం లేదు. మరోపక్క పరీక్షలు(టెస్టులు) పేరిట అధిక దోపిడికి తెరలేపుతున్నారు. ప్రజల అత్యవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న ఆసుపత్రులు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ఆధునిక వైద్యం పేరిట అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన వైద్యాధికారులు మామూలుగా తీసుకుంటూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలోని కొన్ని ప్రయివేటు ఆస్పత్రులు ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నాయి. వైద్య మండలి నిబంధనల ప్రకారం రోగుల నుంచి నిర్ధారిత ఫీజులు తీసుకోవాల్సి ఉండగా.. అధిక ఫీజులు వసూలు చేస్తూ నిబంధనలను విస్మరిస్తున్నాయి. ఆస్పత్రికి వెళ్లగానే నాడీ చూస్తున్న వైద్యులు వివిధ రకాల పరీక్షలు రాస్తున్నారు. ఈ టెస్టులు కూడా అక్కడే చేయించాలి. ఇవి ముగిసిన తర్వాత రాసిన మందులు కూడా అక్కడి మెడికల్‌లోనే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వారికి అనుకూలమైన కంపెనీలకు సంబంధించిన మందులు రాస్తుండటంతో రోగులు గత్యంతరం లేక అక్కడే కొనుగోలు చేయాల్సి వస్తోంది. జ్వరం వచ్చి ఆస్పత్రికి వెళ్తే డాక్టర్ ఫీజు రూ.300తో పాటు వివిధ పరీక్షలకు రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు, మందుల కోసం మరో రూ.వెయ్యి వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒక్కో వ్యక్తి చిన్నపాటి రోగానికి కూడా కనీసం రూ.5వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక ఆస్పత్రిలో అడ్మిట్ అయితే ఆ ఖర్చులు మరింత అదనంగా ఉంటాయి. కొన్ని ఆస్పత్రులు ఒక్కో రోజుకు బెడ్ ఛార్జీకి రూ.2వేల వరకు తీసుకుంటుండగా.. సదరు రోగులకు విడతల వారీగా ఇచ్చే మందుల ఖర్చు మరింత అదనంగా భరించాల్సి ఉంటుంది. ఏదైనా అనారోగ్యంతో ఆస్పత్రిలో అడ్మిట్ అయితే రోజూ రూ.3వేల నుంచి రూ.4వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న అనేక మంది వైద్యం కోసం రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. సర్కారు దవాఖానాల్లో సరైన వైద్యం లభించదనే కారణంగా అనేక మంది పేదలు కూడా గత్యంతరం లేని పరిస్థితిలో ప్రయివేటును ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా తీసుకుంటున్న సదరు ఆస్పత్రి యాజమాన్యాలు అధిక రుసుం వసూలు చేస్తున్నాయనే ఆరోపణలున్నాయి.

కనిపించని బోర్డులు..!

ఒకప్పుడు కొన్నింటికే పరిమితమైన ప్రయివేటు ఆస్పత్రులు తాజాగా వందల సంఖ్యలో వెలుస్తున్నాయి. కేవలం ఆదిలాబాద్ పట్టణంలోనే సుమారు వంద వరకు ప్రయివేటు ఆస్పత్రులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక మంచిర్యాల, నిర్మల్ పట్టణంలోనూ ఇదే సంఖ్యలో ఉన్నాయి. రోజూ వేల సంఖ్యలో జనాలు వివిధ రకాల జబ్బుల కోసం వీటిని ఆశ్రయిస్తుంటారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏదేని ప్రయివేటు ఆస్పత్రిలో ఆయా చికిత్సల కోసం తీసుకునే ఫీజుల వివరాలను కచ్చితంగా బోర్డులపై ప్రదర్శించాల్సి ఉంటుంది. ల్యాబ్‌ల్లోనూ ఇదే విధానం అనుసరించాల్సి ఉంటుంది. కానీ కొన్నింటిలో మినహా అనేక ఆస్పత్రుల్లో ఈ బోర్డులు మచ్చుకైనా కనిపించని పరిస్థితి ఉంటుంది. రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిసినా అధికారులు మిన్నకుండిపోతున్నారనే విమర్శలున్నాయి. గతేడాది ఉమ్మడి జిల్లాలో కొన్ని అనుమతి లేకుండా వైద్యం చేస్తున్న ఆస్పత్రులపై కొరఢా ఝులిపించిన వైద్యాధికారులు వాటికి తాఖీదులు సైతం అందించారు. కానీ రెగ్యూలర్‌గా తనిఖీలు చేయడం లేదనే విమర్శలు మాత్రం జోరుగా వినిపిస్తున్నాయి. ఏదైనా ఘటనలు జరిగిన సందర్భాల్లో తప్పితే రెగ్యూలర్‌గా అధికారుల పర్యవేక్షణ లేకపోవడం కారణంగా ఎవరూ ఏమీ అనడం లేదనే కారణంగా కొన్ని ప్రయివేటు ఆస్పత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలున్నాయి.

అక్రమంగా తరలిస్తున్న తునికాకు స్వాధీనం



నవతెలంగాణ-బోథ్

అక్రమంగా తరలిస్తున్న తునికాకు రెండు ఆటోలను గురువారం అటవీశాఖ ఎఫ్ఆర్‌ఓ ప్రణయ్ పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..రెండు ఆటోలలో తునికాకు బీడీ కట్టలను అక్రమంగా తరలిస్తున్న సమాచారం మేరకు కుచలాపూర్ గ్రామ సమీపంలో ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఆటోలో రూ.50 వేల విలువైన తునికాకు కట్టలున్నాయని ఎఫ్ఆర్‌ఓ తెలిపారు. ఇందులో డిప్యూటీ రేంజ్ అధికారి సుందర్, బీట్ అధికారి నాగరావ్, కోసే రావు, డ్రైవర్ జాబెర్ పాల్గొన్నారు.

భద్రత కల్పించేందుకు గమ్యం యాప్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీ సురక్షిత ప్రయాణంతో పాటు భద్రత కల్పించేల గమ్యం యాప్ అందుబాటులోకి తీసుకువచ్చిందని ఆర్ఎం సోలోమాన్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఆర్టీసీ సేవలు, గమ్యం యాప్‌పై తెలంగాణ సంస్కృతిక సారథి కళాకారులు పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణీకులకు సేవల గురించి తెలియజేస్తూ గమ్యం యాప్ లాభాలను వివరించారు. ఈ సందర్భంగా ఆర్ఎం సొలోమాన్ మాట్లాడుతూ ప్రజలను సురక్షితంగా చేరవేయడంలో ఆర్టీసీ ముందుందన్నారు. ఈ క్రమంలోనే ప్రయాణీకులకు మరింత నాణ్యమైన సేవలను అందించాలనే లక్ష్యంతో గమ్యం యాప్ తీసుకువచ్చామన్నారు. బస్సు ఎక్కడ ఉంది, ఎంత సేపటిలో వస్తుంది, ఎంత సేపటిలో చేరుకుంటారో గమ్యం యాప్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. మహాలక్ష్మీ పథకం వచ్చిన తరువాత ఎక్కువ మంది మహిళలు, అమ్మాయిలు ఆర్టీసీని ఆదరిస్తున్నారని, వారి భద్రతకు కూడా గమ్యం యాప్ ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి ఆర్ఎం ప్రవీణ్, డీఎం కల్పన, కళాకారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్ బాల్స్‌ను పరిశీలించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని మన్మధ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో తయారు చేస్తున్న ఆయిల్ బాల్స్‌ను గురువారం ఎంపీడీఓ సోలమన్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలను డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధుల బారిన ప్రజలు పడకుండా ముందస్తు జాగ్రత్తగాపై అధికారుల సూచన మేరకు ఈ ఆయిల్ బాల్స్‌ను సిద్ధం చేయిస్తున్నామన్నారు. వరి పొట్టు, గ్రీస్ ఆయిల్‌తో కలిపి వీటిని ఉండగా తయారు చేస్తారని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాలతి, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ప్రమాదానికి కారకులైన ఇద్దరికి జరిమానా

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

రోడ్డు ప్రమాదంలో ఓ మహిళలను గాయపరిచిన కేసులో ఇద్దరికి పిసిఆర్ కోర్టు న్యాయమూర్తి దుర్గారాణి జరిమానా విధించినట్లు లైజన్ అధికారి గంగా సింగ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గంగాసింగ్ తెలిపిన వివరాల ప్రకారం 2017 సంవత్సరంలో పట్టణంలోని దస్నాపూర్ బ్రిడ్జి వద్ద భార్యాభర్తలు వెంకన్న, శ్రీదేవిలు నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి ద్విచక్రవాహనం అతివేగంగా అజాగ్రతగా నడుపుకుంటు వచ్చి ఢీకొట్టగా శ్రీదేవికి గాయలైయ్యాయి. దీంతో భార్యాభర్తలు ఇద్దరు మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు బైక్‌తో ఢీకొట్టిన పోశెట్టి, నరేష్‌లపై కేసు నమోదు చేశారు. కాగా గురువారం కోర్టులో విచారించగా నేరం రుజువైనందున పోశెట్టికి రూ. 1500, లైసెన్స్ లేని వ్యక్తికి వాహనం ఇచ్చినందుకు నరేష్‌కు రూ. 2 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు పేర్కొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన మాజీ ఎంపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

కేంద్ర మంత్రులను ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాబురావు కలిసారు. గురువారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను తన నివాస గృహంలో కలిసి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు. పార్టీ కోసం పోరాట పటిమతో పని చేయాలని తన వంతు సహకారం ఉంటుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ తనకు భరోసా ఇచ్చినట్టు సోయం తెలిపారు. అలాగే కేంద్ర గిరిజన శాఖ సహాయ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన ఊయికే దుర్గాదాస్‌ను కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఆదివాసీ ఉద్యమ నేతగా దుర్గా దాస్‌తో తనకు అనుబంధం ఉందని గతంలో ఆయనతో కలిసి పనిచేసిట్టు పేర్కొన్నారు. ఆదివాసుల హక్కులు ప్రధాన సమస్యలను వివరించగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించేందుకు కూడా వస్తానని మంత్రి పేర్కొన్నట్టు సోయంబాపు రావు తెలిపారు.

మృతి చెందిన జర్నలిస్టులకు న్యాయం చేయండి

నవతెలంగాణ-ఉట్నూర్

మృతి చెందిన జర్నలిస్టులకు న్యాయం చేయాలని టీజేఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు లకవత్ రమేష్ కోరారు. గురువారం డీపీఆర్‌ఓ తిరుమలను కలిసి మృతి చెందిన ట్రైబల్ జర్నలిస్టులకు న్యాయం చేయాలన్నారు. గుడిహత్నూర్ మండలానికి చెందిన రిపోర్టర్ రాథోడ్ సిద్ధార్థ్ మృతి చెందాడని, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని విన్నవించారు. దీనిపై డీపీఆర్‌ఓ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు జాదవ్ రవికిరణ్, ఉట్నూర్ డివిజన్ అధ్యక్షులు రాథోడ్ అజయ్, ప్రధాన కార్యదర్శి భీంరావు ఉన్నారు.

రేపు వారసంత వేలం

నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ గ్రామపంచాయితీ దినసంత, వారసంత 2024-25 సంవత్సరానికి రుసుము వసూలు చేయడానికి శనివారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఈఓ శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇతర వివరాలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నేడే వారసంత వేలం

మండలంలోని లింగోజితండ గ్రామపంచాయితీలో పశువుల, దిన, వారసంతకు శుక్రవారం వేలం వేయడం జరుగుతుందని తెలిపారు. లింగోజితండ గ్రామపంచాయితీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని పంచాయతి కార్యదర్శి అడే విక్రం ఒక్క ప్రకటనలో పేర్కొన్నారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

- కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసి లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 2023-24 సంవత్సరానికి సంబంధించి డీసీసీ, డీఎల్ఆర్సీ, ఎల్డీఎం సమావేశం నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులు సాధించిన విజయాల వివరాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వ్యక్తిగత బ్యాంకులు, శాఖల వారీగా సమీక్షించారు. బ్యాంకులకు ఇచ్చిన మహిళా శక్తి లక్ష్యాలను సాధించాలన్నారు. మహిళా శక్తి పాలసీ కింద కొన్ని రకాల కార్యక్రమాలలో ప్రతీ మండలాల్లో లక్ష్యాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక చేస్తామని, మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి లక్ష్యంతో వచ్చే ఐదేండ్లలో మహిళలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళా శక్తి ద్వారా 15 రకాల కార్యక్రమాలు చేపడుతున్నదన్నారు. ఇందులో భాగంగా బ్యాంకుల నుండి రుణాలు సకాలంలో అందించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ 2024-25 సంవత్సరానికి ఆదిలాబాద్ జిల్లా నూతన సంవత్సర వార్షిక రుణ ప్రణాళిక పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా బదిలీ పై వెళుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రసాద్, కొత్త ఎల్డీఎం ఉత్పల్ కుమార్, ఆర్‌బీఐ ఎల్డీఓ దేబోజి బారువా, డీఆర్‌డీఏ పీడీ సాయన్న, ఎస్సీ ఈడీ కార్పొరేషన్, అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

అందరికీ ఆపద్బాంధవుడిగా తొలి సీఎం కేసీఆర్



నవతెలంగాణ-బోథ్

అందరికీ ఆపద్బాంధవుడిగా తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిలిచారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే మండలంలోని అయా గ్రామనికి చెందిన 109 మంది లబ్ధిదారులకు రూ. 1,00,116 కోటి విలువ గల కల్యాణ లక్ష్మీ చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ కృషితో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి అంచెలంచెలుగా అభివృద్ధి చెందిందన్నారు. అలాగే రాష్ట్రంలో అనేక పథకాలు ప్రవేశపెట్టి ప్రజలందరికీ ఆపద్బాంధవుడీగా నిలిచారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 6 నెలల్లోనే పాలనలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బోథ్ ఎమ్మెల్యేగా తనను ఎన్నికల్లో గెలిపిస్తే కాంట్రా వాగు బ్రిడ్జి నిర్మిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చడం జరిగిందన్నారు. త్వరలోనే బోథ్ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల నూతన భవనాలు కూడా నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సంధ్యారాణి, మండల కన్వీనర్ నారాయణరెడ్డి సజన్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు .

అభివృద్ధి, సంక్షేమానికి చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

నీతిఆయోగ్ ప్రతిపాదిత ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి, సంక్షేమానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నీతిఆయోగ్ ప్రతిపాదిత ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన పెంబి మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీతిఆయోగ్ ప్రతిపాదిత ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వందశాతం అమలుచేయాలని ఆదేశించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పశుపోషణ, మౌలిక సదుపాయాలు సహా వివిధ అంశాల సంబంధించి వివరాలను కలెక్టర్ సమీక్షించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు శాతం పెంచాలని సూచించారు. కేంద్రాల్లో పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనాన్ని చిన్నారులకు అందించాలని, పిల్లల ఎదుగుదల, ఇతర వివరాలను పోషణ ట్రాకర్‌లో నమోదు చేయాలన్నారు. అంగాన్‌వాడీల్లో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. పదవ తరగతి పూర్తయిన విద్యార్థులందరూపై చదువులకు కళాశాలలలో ప్రవేశాలు పొందేలా ప్రోత్సహించాలన్నారు. మహిళలకు స్వయం ఉపాధికి శిక్షణలు అందించాలని ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించి వివరాలను శాఖల వారిగా అడిగి తెలుసుకున్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి పెంబి మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్డీఓ విజయలక్ష్మీ, డిప్యూటి డీఎంహెచ్‌ఓ రాజేందర్, ఎంపీడీఓ రమాకాంత్, సీడీపీఓ సరిత, ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమ ప్రతినిధి నవీన్ పాల్గొన్నారు.

కల్కి సినిమా విడుదలతో సందడి

- ఈలలు కేకలు వేస్తూ హోరెత్తించిన ఫ్యాన్స్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పాన్‌ఇండియా స్టార్ హీరో ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన కల్కి మూవీ గురువారం రిలీజ్ అయింది. భారీ బడ్జెట్, అంచనాలతో రూపొందించిన సినిమా విడుదల సందర్భంగా పట్టణంలోని నటరాజ్, మహేశ్వరీ థియేటర్లలో అభిమానులు టపాసులు పెల్చి నృత్యాల నడుమ ప్రభాస్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం సినిమా ప్రారంభం కాగా కేరింతలు, ఈలలు వేస్తు ఉత్సహంగా నృత్యాలు చేశారు. సినిమాలో అగ్ర నాయకులు నటించడం ఒక ఎత్తు అయితే, తొమ్మిది రకాల యుద్ధాలకి సంబంధించిన ఎపిసోడ్స్ ఉంటాయని సినిమా చూసిన వారు అంటున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందించిన సినిమా కావడం, చాలా రోజుల తరువాత స్టార్ హీరో సినిమా థియేటర్‌లో విడుదల కావడంతో జనాలు ఆసక్తిగా తిలకించారు. తొలి రోజు కావడంతో రెండు థియేటర్‌లలో షో వేశారు. శుక్రవారం నుండి ఒక థియేటర్‌లో సినిమా కొనసాగుతోందని థియేటర్ యాజమాన్యం తెలిపింది.

ఇంద్రవెల్లి స్తూపానికి పర్యాటక శోభ

నవతెలంగాణ-ఉట్నూర్



అన్ని హంగులతో ఇంద్రవెల్లి అమర వీరుల స్తూపాన్ని పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి, నాగోబా ఆలయ అభివృద్ధికి రూ.కోటి మంజూరు చేసిందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా సార్మెడిలు, రగల్ జెండా కమిటీ, మేస్రం వంశీయులు, అధికారులతో సమావేశమై పలు అభివృద్ధి విషయాలపై సుదీర్ఘంగా చర్చించి సలహాల, సూచనల తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో సీఎం రేవంత్ రెడ్డి అమర వీరుల స్తూపంతో పాటు నాగోబా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని మాటిచ్చారని నేడు ఆ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని తెలిపారు. ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు రూ. కోటి మంజూరు చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తోందన్నారు. అమర వీరుల స్తూపం వద్ద పర్యటకులను ఆకర్షించేందుకు అన్ని రకాల మొక్కలు, చెట్లను నాటడం జరుగుతుందని తెలిపారు. స్తూపం చుట్టూ ప్రహరీ గోడ ఏర్పాటు చేయడంతో పాటు నీటి సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా నాగోబా ఆలయ అభివృద్ధికి రూ.కోటి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మేస్రం వంశీయులు, దేవాదాయ శాఖ నాగోబా ఆలయంలో చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి నివేదికలు తమకు ఇస్తే త్వరలో పనులను చేపట్టడం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, జిల్లా సార్మేడిలు, రగల్ జెండా కమిటీ, మేస్రం వంశీయులు పాల్గొన్నారు.

యువ కవి భీమేష్‌కు యువ పురస్కారం

నవతెలంగాణ-నిర్మల్



ఇటీవల తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రతి సంవత్సరం అందజేస్తున్న పురస్కారాలలో భాగంగా నిర్మల్ జిల్లా అనంతపెట్ చెందిన యువ కవి, కళాకారుడు పోలీస్ భీమేష్ ఈ సంవత్సరం యువ పురస్కారానికి ఎంపికయ్యారు. స్వేచ్ఛకు సంకెళ్ల అనే మొదటి పుస్తకానికి యువ పురస్కారం రావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ పుస్తకాన్ని తెలంగాణ రాష్ట్ర మాజీ గవర్నర్ తమిళిసై సుందర్ రాజన్ ఆవిష్కరించారు. యువ పురస్కారాన్ని సారస్వత పరిషత్తు అధ్యక్ష కార్యదర్శులు ఎల్లూరి శివారెడ్డి, జున్ను చెన్నయ్యలు అధికారికంగా ప్రకటించారు. పోలీస్ భీమేష్ మట్టితో నిన్నో శిల్పాలు, ఆకృతులను సృష్టించి మెప్పు పొందారు. కవిగా మొదటి పుస్తకానికే పురస్కారం రావడం గర్వించదగ్గ విషయమని ప్రముఖ కవి డాక్టర్ దామెర రాములు, డాక్టర్ కావేరి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అప్పల చక్రధారి, మానస సాహితీ సంస్థ అధ్యక్షులు తుమ్మల దేవారావ్, కంటి వైద్యులు డాక్టర్ కృష్ణంరాజు, కవి యాత్ర అధ్యక్షులు కారం శంకర్, కామారపు జగదీశ్వర్, మునిమడుగుల రాజారావు, కవులు అంబటి నారాయణ, పత్తి శివప్రసాద్, బి.వెంకట్ కవి, తెలంగాణ తల్లి రూపశిల్పి బీవీఆర్ చారి, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు, గ్రామ పెద్దలు గురువారం భీమేష్‌ను అభినందించారు.

ఈవీఎం గోడౌన్‌ల పరిశీలన

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదామును గురువారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి వివిధ రాజకీయ నాయకుల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈవీఎం గోదాం వద్ద నిరంతరం పటిష్ట భద్రతను కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో నిర్మల్, ముధోల్, ఉట్నూర్ ఆర్డీఓలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, జీవాకర్‌లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రావణ్‌రెడ్డి, రమేష్ మజార్, సయ్యద్ హైదర్, నరేష్‌లు, భద్రతా సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పదోన్నతి పొందిన బ్యాంక్ మేనేజర్‌కు సన్మానం

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామంలో టీజీబీ బ్యాంక్ మేనేజర్‌ను గురువారం టీజీబీ బ్యాంక్‌లోని మహార్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యుడు కాంబ్లే భీమ్‌రావు గురువారం స్థానిక బ్యాంకులో సన్మానించారు. అలాగే ఆయన ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం మాధవ్, వీఓఏ, కార్యదర్శి పవార్ శ్యామ్‌రావు పాల్గొన్నారు.



పోడు భూముల పరిశీలన

- ఎఫ్‌డీపీటీ శాంతారాయ్



నవతెలంగాణ-ఇచ్చోడ

ఇటీవల కాలంలో కంపార్ట్‌మెంట్ నెంబర్ 174 బాబ్జిపేట్ బీట్ పరిధిలో ఆక్రమణకు గురైన అటవీ ప్రదేశాన్ని గురువారం ఎఫ్‌డీపీటీ శాంతారాయ్, కవ్వాల్ టైగర్ రిజర్వ్, జిల్లా అటవీ శాఖాధికారి ప్రశాంత్ బాజీరావు పటేల్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీ భూమి ఆక్రమణ చేసిన వారితో ఎఫ్‌డీపీటీ శాంతారాయ్ మాట్లాడుతూ ఈ సందర్భంగా ఒక కుటుంబానికి సరాసరి 15 నుంచి 17 ఎకరాల వరకు మొత్తం సుమారు 3,920 ఎకరాల భూమిని వారు ఆక్రమించినటువంటి విషయాన్ని అధికారులు గుర్తించారు. భూ ఆక్రమణదారులకు జీవనోపాధి కొరకు ప్రత్యామ్నాయ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. రేపటి నుంచి యధావిధిగా మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా అటవీ భూమి ఆక్రమాలకు పాల్పడినా, స్మగ్లింగ్, కార్యక్రమాలు చేసిన వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ ఆఫీసర్ గణేష్, పెంబి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామకృష్ణ, ఇచ్చోడ సీఐ భీమేష్ పాల్గొన్నారు.

బోథ్ మహిళకు రాష్ట్ర గ్లోబల్ ఇన్‌స్పైర్ అవార్డు

నవతెలంగాణ-బోథ్



మండలంలోని బాబేర గ్రామానికి చెందిన ఆత్రం సుశీలకు రాష్ట్ర గ్లోబల్ ఇన్‌స్పైర్ అవార్డు దక్కింది. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి మక్స్ గ్లోబల్ ఫౌండేషన్ గ్లోబల్ అవార్డు సెలబ్రేషన్ 2024 గోల్డెన్ నంది అవార్డు కార్యక్రమంలో ఆత్రం సుశీలకు గ్లోబల్ ఇన్‌స్పైర్ అవార్డును అందించారు. జిల్లాలోని ఆమె చేసిన సేవలు మారుమూల గిరిజన పల్లెల్లో సామాజిక సేవా కార్యక్రమాలు ఏజెన్సీ ప్రాంతాల్లో నిరక్షరాస్యత, విద్య, వైద్యం, మరుగుదొడ్లు, పరిశుభ్రత, కరోనా వ్యాక్సిన్ పై అవగాహన అలాగే మహిళా సంఘాల నిర్వహణ పొదుపు, గర్భిణుల ఆరోగ్య పరిస్థితులపై అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరికి సేవ చేసినందుకు ఆమెను గుర్తిస్తూ, రాష్ట్ర అవార్డు దక్కిందని తెలిపారు.

విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి



నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలకు పదోన్నతిపై వచ్చిన 14 మంది ఉపాధ్యాయులకు మాజీ సర్పంచ్ చెట్లపల్లి సదానందం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొనాల గ్రామం అంటేనే ఉద్యోగ ఉపాధ్యాయులకు పుట్టినిల్లుగా ఉందని, అలాంటి గ్రామానికి పదోన్నతిపై రావడం ద్వారా ఉపాధ్యాయులపై మరింత బరువు బాధ్యతలు ఉంటాయని అన్నారు. విద్యార్థులను క్రమశిక్షణకు మారుపేరుగా నిలుపుతూ అన్ని రకాలుగా విద్యార్థులను సర్వతోముఖాభివృద్ధి పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేశ్‌ముఖ్ సచిన్, నాయకులు చిన్నయ్య, రామాయి శంకర్, సుభాష్, సూర్య సోమన్న ఉపాధ్యాయులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా ఉంచాలి

నవతెలంగాణ-నార్నూర్

పీహెచ్‌సీలో అన్ని రికార్డులు ఎప్పటి కప్పుడు పూర్తి చేయాలని డాక్టర్ రాంబాబు వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం తాడిహత్నూర్ సబ్‌సెంటర్‌ను సందర్శించారు. ఎంసీహెచ్, ఎన్‌సీడీ, టీబీ, ఏఎన్‌సీ, పీఎన్‌సీ, ఏఎన్‌ఎం టూర్ వైద్య శిబిరాల రికార్డును పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రతి శుక్రవారం గ్రామంలో కార్యదర్శి, ఏఎన్‌ఎం, ఆశాలు, అంగన్‌వాడీ, మహిళ సంఘం గ్రూప్ సభ్యుల సహకారంతో పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. వారి వెంట హెల్త్ సూపర్‌వైజర్‌లు చౌహాన్ చరణ్‌దాస్, సతవ్వ వైద్య సిబ్బంది సుశీల, సంగీత, శ్రీలత, అనిత ఉన్నారు.

అక్రమ లేఅవుట్‌లపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మావల మండలంలోని సర్వే నెంబర్ 72/3 అసైన్డ్ భూమిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కలిసి సబ్ రిజిస్ట్రార్ అధికారులు అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సిర్ర దేవందర్ ఆరోపించారు. గురువారం కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. అక్రమ లేఅవుట్‌లు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్ ఉన్నారు.

ఆస్పత్రి నిర్మాణాలను పూర్తి చేయాలి

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వాస్పత్రి నిర్మాణం పనులను త్వరలో పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని బీజేపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. ముధోల్‌లో ఆగిపోయిన ఆస్పత్రి నిర్మాణ పనులను బీజేపీ మండలాధ్యక్షులు కోరి పోతన్న ఆధ్వర్యంలో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.8 కోట్లతో మంజూరైన 30 పడకల ఈ ఆస్పత్రి నిర్మాణ పనులు బెస్మెంట్ లెవల్‌కే నిలిచిపోయిందని, సంవత్సరం దాటిన పనులు ప్రారంభించడం లేదన్నారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ ఆస్పత్రిని 100 పడుకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి పనులను పూర్తి చేసి, వైద్యసిబ్బందిని, వైద్యులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సతీష్‌రెడ్డి, రవికిరణ్ గౌడ్, సప్పటోల్ల పోతన్న, ధర్మపురి సుదర్శన్, సంతోష్ పాల్గొన్నారు.

పోలీసులు కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల



నవతెలంగాణ-నిర్మల్

ప్రతి ఒక పోలీసు అధికారి కొత్త చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల అన్నారు. పోలీస్ అధికారులకు, సిబ్బందికి నూతన చట్టాలపై దశల వారీగా శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ తరగతులు గురువారం ముగిసాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. జులై ఒకటో తేదీ నుంచి అమలులోకి రానున్న నూతన చట్టాల పట్ల ప్రతి ఒక పోలీసు అధికారి, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని ఉద్యేశంతో ప్రతి సబ్ డివిజన్‌లో అధికారులు, సిబ్బందికి ఈ శిక్షణ తరగతులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. జులై 1వ తేది నుంచి దేశవ్యాప్తంగా కొత్త చట్టాలను అమలు చేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అందుకు అనుగుణంగా కొత్త చట్టాలను అనుసరిస్తూ ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం-2023 పూర్తి అవగాహన కలిగి ఉన్నపుడే సమర్థవంతంగా విధులు నిర్వహించగలమని అన్నారు. కొత్త చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన రావాలంటే ప్రతి ఒక్కరిలో నేర్చుకోవాలనే తపన ఉన్నప్పుడే సాధ్యం అవుతుందన్నారు. కొత్త చట్టాల అమలు జరిగిన వెంటనే ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన అవసరమన్నారు. అప్పుడే బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ఆయా సెక్షన్ల కింద కేసులు నమోదు చేయవచ్చాన్నారు. అరెస్ట్ వాంగ్మూలం నమోదు నందు పాటించాల్సిన జాగ్రత్తలు పాటిస్తూ, నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో దర్యాప్తు అధికారులు వ్యవహరించాల్సిన తీరు, తదితర అంశాలపై కొత్త చట్టాలలో మార్పుల గురించి వివరించారు. భారతన్యాయ వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నదనీ, అవసరాన్ని బట్టి ప్రజా భద్రత కోసం ఎన్నో చట్టాలను రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధి విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని అన్నారు. ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలుగా ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ కొత్త చట్టాలను నేర్చుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఈ నూతన చట్టాలపై శిక్షణ తరగతులను ఏర్పాటు చేయడంలో సమన్వయాధికారిగా వ్యవహరించిన డీసీఆర్బీ సీఐ గోపినాథ్, ఆర్ఎస్ఐ రవి కుమార్, శిక్షకులు సీఐలు నవీన్ కుమార్, సైదారావు, ఎస్ఐలు సాయి కుమార్, సాయి కిరణ్, జ్యోతిని అభినందించారు.

కాంగ్రెస్ మాటిస్తే తప్పదు : ఆత్రం సుగుణ

నవతెలంగాణ-తాంసి



కాంగ్రెస్ ప్రభుత్వం మాటిస్తే తప్పకుండా అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ అన్నారు. గురువారం ప్రభుత్వం ఏకకాలంలో రుణమాఫీ చేయడాన్ని హర్షిస్తూ, మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీపై తీసుకున్న నిర్ణయంపై ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు, ఏకకాలంలోనే రెండు లక్షల రుణమాఫీ కార్యరూపం దాలుస్తుండటంతో అన్నదాత ముఖాల్లో ఆనందం నింపుతోందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం ప్రకటనపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోందన్నారు.ఇది నిజంగానే యావత్ తెలంగాణ రైతులకు మంచి శుభవార్తని తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను ఎప్పుడు తప్పదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆత్రం భాస్కర్, మండల కన్వీనర్ అశోక్, యూత్ ప్రెసిడెంట్ ముస్రం, దాసరి రమేష్, అన్ను పటేల్, తన్వీర్ పటేల్, మతిన్ పటేల్, మల్లేష్ యాదవ్, అశోక్‌రెడ్డి, దేవ రెడ్డి, గంగారెడ్డి, సుదర్శన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆడబిడ్డ పెండ్లికి అండగా నిలిచిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి అండగా నిలిచిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక బిడ్డ పెండ్లి చేయాలంటే తల్లికి, తండ్రికి నిద్ర పట్టేది కాదని అలాంటి సమయంలో చేయూత కోసం బందువుల వైపు చూడాల్సి వచ్చేదని అన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో అడబిడ్డ పెండ్లి అంటే ప్రభుత్వమే అండగా నిలవాలని కేసీఆర్ కళ్యాణలక్ష్మీ పథకం ప్రారంభించి, ఆడబిడ్డలకు అండగా లక్ష రూపాయలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వం ద్వారా దాదాపు 18 లక్షల పేదింటి బిడ్డల పెండ్లిలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని అన్నారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 52 మంది లబ్దిదారులకు రూ. 1,00,116 చొప్పున మొత్తం రూ. 52లక్షల 6వేల 32ల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం టీఎస్ మోడల్ స్కూల్ సందర్శించి, పాఠశాలలో నెలకొన్న సమస్యలను విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు సొనాల నుంచి ఇచ్చోడ రహదారి కొల్హారి గ్రామం వద్ద బ్రిడ్జ్ నిర్మాణం పనులను పరిశీలించి, త్వరగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్నటువంటి కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలలో ఫీజు నియంత్రించాలని, ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలో యూనిఫామ్స్, టై, బెల్టు, షూస్, పాఠ్యపుస్తకాలను అమ్మకూడదని తీసుకొచ్చిన జీఓ ను అమలు పరచాలని అన్నారు. జిల్లాలో గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకొని సీజ్ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేసే దిశగా జిల్లా విద్యా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎర్రజి హరీశ్, మడావి గణేష్, జిల్లా సహాయ కార్యదర్శి కనక దత్తత్రి, పీవైఎల్ జిల్లా నాయకులు మెస్రం మారుతి పాల్గొన్నారు.

ఢిల్లీ ధర్నాలో జిల్లా నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షలను రద్దు చేయాలని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద గురువారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. యువజన కాంగ్రెస్ నేషనల్ ప్రెసిడెంట్ బీవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, తెలంగాణ ఎంపీలు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, రఘువీరారెడ్డి, గడ్డం వంశీ, ఈ ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ ఢిల్లీలో పార్లమెంటు ముట్టడి చేపట్టి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఎండగట్టారు. నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌గౌడ్, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పోతారెడ్డి, యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పోతారెడ్డి, ఆసిఫాబాద్ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్యామ్, నైతం ప్రభాకర్ పాల్గొన్నారు.

మాదిగల ఆత్మగౌరవ కవాతు జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎమ్మార్పీఎస్ దండోరా ఉద్యమం ఆవిర్భావించి, జులై 7వ తేదీ నాటికి 30 సంవత్సరాలు పూర్తి చేసుకుందని ఈ నేపథ్యంలో జులై 7న వరంగల్ జిల్లా కేంద్రంలో మాదిగల ఆత్మగౌరవ కవాతును నిర్వహించడం జరుగుతుందని దీన్ని జయప్రదం చేయాలని ఎమ్మెస్పీ సీనియర్ నాయకులు కుడాల స్వామి తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కుడాల స్వామి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు, ఉపకులాల ప్రజలందరూ జులై 5వ తేదీలోగా అన్ని గ్రామ, మండల కేంద్రాలలో జెండా గద్దెలు నిర్మించి జెండా ఆవిష్కరణలు చేసి, జులై 7న చలో వరంగల్ మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెస్పీ సీనియర్ నాయకులు కాంబ్లె బాలాజీ, దాసరి రాంప్రసాద్, కారం రవి, అన్నేపగా అశోక్ రేంజర్ల రాజు, మాదిగ పరుశురాం, మోరే దీపక్, సూర్యవంశి సాంబ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ కమిటీ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహ కమిటీ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జోహండలే ధమ్మపాల్, ఉపాధ్యక్షులు వాగ్మరే చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి చందనే గౌతమ్, సహాయ కార్యదర్శి గంగాప్రసాద్, కోశాధికారి సొన్కాంబ్లే రాహుల్, జాయింట్ క్యాషియర్ సునీల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నుకున్న కమిటీ సభ్యులను సంఘ సభ్యులను ఘనంగా సన్మానించారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలిన

నవతెలంగాణ-ముధోల్

భైంసా నుంచి బోధన్ వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను గురువారం నేషనల్ హైవే ఈఈ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. నాయాబాధి చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహం గురించి దళిత సంఘం నాయకులు అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఐ మల్లేష్, రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించిన ప్రతినిధి విష్ణువర్ధన్‌రెడ్డి, దళిత సంఘం నాయకులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



నవతెలంగాణ-లోకేశ్వరం

ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు రాజూర గ్రామంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో దోమలు వృద్ధి చెందవని, తద్వారా వ్యాధులు ప్రబలవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం గోదావరి, ఆశా కార్యకర్తలు టీకి శ్రీలత, సవిత, మమత, పంచాయతీ కార్యదర్శి మహేష్, అంగన్‌వాడీ టీచర్ పుప్పాల పద్మ, దేవోల్ల శోభ, మహిళలు పాల్గొన్నారు.

వీర జవాన్‌కు ఘన నివాళి



నవతెలంగాణ-తాంసి

భారత సైన్యంలో విధులు నిర్వహిస్తూ, గత మూడు సంవత్సరాల కింద ప్రాణాలు వదిలిన వీర జవాన్ దాసరి నవీన్ మూడో వర్ధంతి గురువారం పొన్నారి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. నవీన్ విగ్రహం వద్ద ప్రాణదాత ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రమేష్ తో పాటు కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నవీన్ విద్యార్థి దశలోనే భారత దేశానికి సేవ చేయాలనే ధృఢ సంకల్పంతో చురుకుగా ఉండేవాడని గుర్తు చేసుకున్నారు. ఆయన చేసిన సేవలు ఇప్పటికీ మాకు గుర్తుంటాయని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జవాన్ తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు ఫౌండేషన్ సభ్యులు దినేష్, కృష్ణ, చైతన్య ఉమేష్, మహేష్, సాయిరాం, నగేష్ ఉన్నారు.

కరెంట్ వైర్లకు అల్లుకున్న చెట్ల తీగలు

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కల తీగలు అల్లుకుపోవడంతో సదరు రైతులు ఆందోళన చెందుతున్నారు. టౌన్ ఏజీఎల్ ఫీడర్ పరిధిలోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ పలువురు రైతులకు సాగునీటి వనరుగా పనిచేస్తోంది. విద్యుత్ స్తంభం నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌కు సప్లయ్ చేసే కరెంట్ తీగలకు పిచ్చి మొక్కలు అల్లుకున్నాయి. ఇదే కాకుండా గోదివరి నదీ తీరంలో ఉన్న మరికొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు ఇలాంటి దుస్థితిలోనే ఉన్నాయి. ఖరీఫ్ మొదలవుతున్న క్రమంలో కరెంట్ లైన్ సరిగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సమస్యను వారం కింద సదరు లైన్‌మెన్‌కు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ట్రాన్స్‌ఫార్మర్లను సకాలంలో సరిచేస్తేనే రైతులు ఖరీఫ్ సాగు పనులకు ఉపక్రమిస్తారు. లైన్‌మెన్ ఇకనైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బాలుడిపై అత్యాచారం కేసులో నిందితుడికి జైలుశిక్ష

- రూ.10వేలు జరిమానా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మైనర్ బాలుడుపై అత్యాచారం చేసిన నిందితుడికి 20 సంవత్సరాల జైలుశిక్ష, రూ.10వేల జరిమాన విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి డాక్టర్ పి.శివరాం ప్రసాద్ తీర్పు వెలువరించినట్టు లైజన్ అధికారి పండరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2021 సంవత్సరం జూన్ నెలలో నేరడిగొండ మండలంలో 8 సంవత్సరాల బాలుడిని సమీప బంధువైన మహేష్ అనే వ్యక్తి తన ఇంటికి తీసుకెళ్లాడు. బాలుడి బట్టలు విప్పి అసహజ పద్ధతిలో లైంగిక వాంఛ తీర్చుకుంటుండగా దొరికాడు. దీంతో బాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు అప్పట్లో నేరడిగొండ ఎస్సై భరత్ సుమన్ కేసు నమోదు చేసి, సెక్షన్ 377 ఐపీసీ, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి బాధితుడిని రిమ్స్ ఆస్పత్రికి పంపించి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కేసులో అప్పటి డీఎస్పీ ఎస్.ఉదయ్‌రెడ్డి విచారణ జరిపి సాక్షులను సేకరించి, చార్జిషీటు దాఖలు చేయగా, ప్రత్యేక పిపి ఎన్ రమణారెడ్డి 11 మంది సాక్షులను విచారించి, కేసు రుజువు చేయగా, ప్రత్యేక న్యాయమూర్తి, అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శివరాం ప్రసాద్ తీర్పు వెలువరించారు. నేరస్థుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధించారు. ఈ కేసులో సీడీఓ బిఎస్ గౌతమ్, అబ్దుల్ అహ్మద్ సాక్షులను సమయానికి కోర్టులో హాజరు పరచగా, బాధితునికి రూ. ఐదు లక్షల నష్టపరిహారం అందించాలని న్యాయ సేవ అధికార సంస్థకు ఆదేశించారని లైజన్ అధికారి పేర్కొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

నవతెలంగాణ-ముధోల్



గ్రామపంచాయతీలలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి సీజనల్ వ్యాధులు రాకుండా చూడాలని జెడ్పీ సీఈఓ ఐ.గోవింద్ అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం ముధోల్ నర్సరీని పరిశీలించి వివరాలను అడిగితెలుసుకున్నారు. మండలానికి 97 వేల మొక్కలను అన్ని గ్రామపంచాయతీల వారిగా ఇచ్చిన టార్గెట్‌ను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ ఫాంట్లకు కంచె ఏర్పాటు చేయాలన్నారు. ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా సంబందిత గ్రామపంచాయతీ అధికారులు, కార్యదర్శులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకులలో నెలలో మూడు సార్లు క్లోరినేషన్ చేయాలని సూచించారు. మురుగు కాలువలు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలన్నారు. మురుగు కాలువలు, గుంతలలో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేయాలన్నారు.

జూలై 5న దివ్యాంగులకు బస్సు పాస్ మేళా

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండల కేంద్రంలోని రైతు వేదికలో జూలై 5న ఆర్టీసీ ఆధ్వర్యంలో రాయితీపై దివ్యాంగులకు బస్సు పాస్ మేళాను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆల్బర్ట్ తెలిపారు. గురువారం మండలంలో ఏర్పాటు చేసిన ఆయన పాల్గొని మాట్లాడుతూ మేళకు సదరం సర్టిఫికెట్ ఉన్న దివ్యాంగులు మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదిక కార్యాలయంలో హాజరు కావాలని, ఈ శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, రెండు ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ తమ వెంట తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ గంగాసింగ్, ఆర్టీసీ సిబ్బంది దుర్గం తులసిరామ్, జూండే పేంటు, వికలాంగుల సంఘాల జిల్లా అధ్యక్షులు ఇప్ప రవి, శంకర్ పాల్గొన్నారు.

అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలంలోని డబ్బా, దరంపల్లి వాగు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు ఎస్సై నరేష్ సిబ్బందితో కలిసి దాడి చేసి మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నారు. మండలంలోని రవీంద్ర నగర్-2 గ్రామానికి చెందిన విశ్వజిత్ మండల్, డబ్బా గ్రామానికి చెందిన సోనుర్ల వినోద్, కౌటాల మండలానికి చెందిన దండిక వెంకటేష్‌లకు చెందినవిగా గుర్తించారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇకపై ఎవరైనా ఇసుక తరలిస్తే సంబంధిత అధికారుల నుండి అనుమతి తప్పనిసరి తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటు కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

విద్యుద్ఘాతంతో గేదె మృతి

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని పీకల గుండం గ్రామంలో విద్యుద్ఘాతంలో దుర్గం పురుషోత్తంకు చెందిన గేదె గురువారం మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి వీచిన గాలులకు గ్రామంలో విద్యుత్ వైర్ తెగి పడి ఉండటంతో దాన్ని తాకి షాక్‌కు గురై మృతి చెందిందన్నారు. గేదె విలువ రూ.70 వేలు ఉంటుందని ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

ఎట్టకేలకు పాత మార్కెట్‌లో తొలగించిన చెత్త



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని పాత కూరగాయల మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ అధికారులు తొలగించడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో నివాసముండే ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. 2021 మే నెలలో కూరగాయల మార్కెట్‌ను వివేకానంద చౌక్ నుండి నూతనంగా నిర్మించిన జూబ్లీ మార్కెట్‌కు తరలించారు. జిల్లా కేంద్రంలో ప్రధానంగా దుకాణ సముదాయాలు ఉండే ప్రాంతం కావడంతో వివిధ మండలాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు ఈ ప్రాంతంలో ప్రతిరోజు తిరుగుతుంటారు. మార్కెట్ తరలించిన తర్వాత పాత మార్కెట్ స్థలానికి రెండువైపులా కంచే వేసినప్పటికీ అది పూర్తిస్థాయిలో వేయలేదు. దీనికి తోడు ఈ ప్రాంతంలో జనసంచారం ఎక్కువగా ఉండి సులబ్ కాంప్లెక్స్ లాంటివి అందుబాటులో లేకపోవడంతో ప్రజలు పాత మార్కెట్ ప్రాంతాన్ని మరుగుదొడ్లుగా వినియోగించుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో దోమలు పెరిగి రోగాల బారిన పడే అవకాశం ఉందని గమనించిన మున్సిపల్ కమిషనర్ భుజంగరావు చెత్తను తొలగించాలని సూచించడంతో సిబ్బంది మూడు రోజుల పాటు ప్రొక్లైనర్ ఏర్పాటుచేసి పేరుకుపోయిన చెత్తను, పిచ్చి మొక్కలను, శిథిలమైన గోడలను తొలగించడంతో ఆ ప్రాంతంలో నివాసముండే ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీగా మార్చిన తర్వాత ప్రస్తుత జూబ్లీ మార్కెట్ రాజంపేట పరిధిలోకి వస్తుండగా, ఆసిఫాబాద్‌కు కూరగాయల మార్కెట్ లేకుండా పోయే ప్రమాదం ఉంది. అయితే పాత మార్కెట్ ప్రాంతాన్ని శుభ్రం చేయడంతో మళ్ళీ అక్కడే మార్కెట్ ఏర్పరుస్తారని ప్రజలు చర్చించుకుంటూ ఉండగా ఇదే విషయం కమిషనర్‌ను అడగక మున్సిపాలిటీ పరిధిలో పిచ్చి మొక్కలు పెరిగిన ప్రాంతాన్ని వర్షాకాలం నేపథ్యంలో శుభ్రం చేస్తున్నామన్నారు. పాత మార్కెట్ ప్రాంతాన్ని కూడా శుభ్రం చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు అయితే మార్కెట్ ఏర్పాటుపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ఏది ఏమైనా పాత మార్కెట్ ప్రాంతం శుభ్రం కావడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వాయిదా పడిన పశువుల మార్కెట్ వేలం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

హుడికిలి గ్రామపంచాయతీ పరిధిలో 2024 25 ఆర్థిక సంవత్సరానిగాను పశువుల మార్కెట్ వేలం పాటను నిర్వహించగా ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోవడంతో వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి హరీష్ తెలిపారు. గురువారం హుడికిలి గ్రామపంచాయతీ కార్యాలయంలో పశువుల వేలం పాటను ఇన్చార్జి ఎంపిఓ కష్ణమూర్తి సమక్షంలో నిర్వహించగా, ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోవడంతో వాయిదా వేసినట్లు తిరిగి ఈ వేలం పాటను నిర్వహించుటకు గ్రామపంచాయతీ పాలకమండలి తీర్మానం మేరకు, ఈనెల 29వ తేదీన గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో వేలం వేయుటకు నిర్ణయించినట్లు, వేలం లో పాల్గొనేవారు గ్రామపంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండరాదని వేలంలో పాల్గొనేవారు ముందుగా 50వేల రూపాయలను గ్రామపంచాయతీ పేరు మీద డిపాజిట్ కట్టవలెనని, డిపాజిట్ దారుడు మాత్రమే వేలంపాటలో పాడుటకు అర్హుడని, వేలం పూర్తయిన తర్వాత వేలం పాట దక్కించుకున్న వారు వారి డిపాజిట్ డబ్బులు ఆపి మిగతా వారి డబ్బులు తిరిగి ఇవ్వబడునని, వేలంపాట దక్కించుకున్న వారు అదే రోజు డబ్బులు కట్టవలసి ఉంటుందని, వేలంలో సరైన ధర రానియెడల రెండో పాటపై వేలం వేయబడని, వేలం గిట్టుబాటు ధర రాని ఎడల నిలిపివేయుటకు గ్రామపంచాయతీ కార్యదర్శి పూర్తి అధికారం ఉందని అన్నారు. వేలంపాటలో పాల్గొనేవారు మరిన్ని వివరాల కొరకు గ్రామపంచాయతీ సిబ్బందిని సంప్రదించాలని అన్నారు.

ఏఓలుగా ఇద్దరూ యువతులు ఎంపిక

నవతెలంగాణ-బెజ్జూరు

మండలానికి చెందిన ఇద్దరు యువతులు ఏఓలుగా ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన ఏఓ ఫలితాల్లో సత్తా చాటి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మండల కేంద్రానికి చెందిన మిర్యాల మనీషా, సలుగుపల్లి గ్రామానికి చెందిన పేదం ప్రేమలత ఏఓలుగా అర్హత సాధించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది 16మే 2023న ఏఓ ఉద్యోగాల కోసం పరీక్ష రాయగా, ఏడాది కాలం తర్వాత ఎట్టకేలకు ప్రభుత్వం ఫలితాలు విడుదల చేయడంతో మొదటిసారిగా మండలానికి చెందిన ఇద్దరు యువతులు వ్యవసాయ అధికారులుగా ఎంపిక రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మనీషా



ప్రేమలత

వర్షం కోసం కప్పతల్లి ఆటలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నప్పటికీ జిల్లాలో వర్షాలు నమోదు కాకపోవడం పట్ల అగ్రి ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కప్పతల్లి ఆడారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా కప్పతల్లి ఆట నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రి ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు కవ్వాల మహేందర్, ఉపాధ్యక్షులు కొండ తిరుపతిలు మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ కప్పతల్లి ఆడుతున్నట్లు తెలిపారు. ఏరువాక ప్రారంభించి పంట చేలల్లో విత్తనాలు విత్తుకొని రైతన్నలు వర్షం కోసం ఎదురుచూస్తున్నరని, జిల్లాలో కొద్ది రోజులుగా వర్షాలు కురవకపోవడంతో రైతులంతా ఆందోళన చెందుతున్నారన్నారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ కప్పతల్లి ఆట ఆడడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అగ్రి ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు నరేష్, నరేందర్, రాజు, సురేష్, ప్రణయ్, రమేష్, సంతోష్, సునీల్, ఆనంద్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భగీరథ సమగ్రతను పెంచే ప్రయత్నం

- గృహాల వారిగా చివరి దశకు సర్వే
- జిల్లాలో 1,15,836 గృహాల లక్ష్యం



సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి(ఫైల్)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇంటింటికి శుద్ధ జలం అందించే ఉద్దేశ్యంతో మిషన్ భగీరథ ప్రారంభించింది. అయితే పథకం ప్రారంభం బాగానే ఉన్నప్పటికీ అమలులో క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఐదు సంవత్సరాలు ప్రస్తుత కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు భగీరథలో ఉన్న బాధలు గమనించి అధికారంలోకి రాగానే పథకం పరిస్థితి కోసం ప్రత్యేక సర్వే చేపట్టారు. దీనిలో భాగంగా

మండలం	మొత్తం	సర్వే అయిన గృహాలు
సిర్పూర్ టి	8361	5909
జైనూర్	7536	5797
లింగాపూర్	3102	2565
సిర్పూర్ యు	3635	3046
ఆసిఫాబాద్	9607	8140
రెబ్బెన	9069	7823
దహేగాం	7330	6580
కాగజ్ నగర్	11802	10894
బెజ్జూర్	6973	6543
తిర్యాని	5985	5705
కౌటాల	8650	8366
చింతలమానపల్లి	7535	7427
వాంకిడి	7804	7726
కెరమెరి	6640	6599
పెంచికల్‌పేట	3580	3597

జిల్లాలో మొత్తం 1,15836 గృహాల్లో సర్వే చేస్తున్న అధికారులు ఇప్పటివరకు 85శాతం పూర్తి చేశారు. సర్వే పూర్తి అయితే పథకం సమగ్రత మరింత పటిష్టంగా ఉండనున్నట్లు తెలుస్తోంది.

భగీరథ సమగ్రతను పెంచే ప్రయత్నం

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.40 వేల కోట్లకు పైగా వ్యయంతో ప్రారంభించిన భగీరథ పథకం క్షేత్రస్థాయిలో సరిగ్గా అమలు కాకపోవడంతో ఇంటింటికి నల్ల నీరు అనేది 100శాతం పూర్తికాలేదు. దీన్ని గమనించిన కాంగ్రెస్ ప్రభుత్వం భగీరథ సమగ్రతను పెంచడానికి ప్రత్యేక సర్వే చేపట్టడానికి నిర్ణయించింది. దీనిని జిల్లా పంచాయతీ అధికారులకు అప్పగించడంతో వారు సెక్రటరీల ద్వారా సర్వే చేయిస్తున్నారు. సర్వేలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లిన సభ్యులు ఇంట్లో సభ్యులు ఎంతమంది అనేదానితో పాటు యజమాని వారి వివరాలను నమోదు చేస్తున్నారు. ఇంటికి నల్ల కనెక్షన్ ఉంటే దాని పరిస్థితితో పాటు నల్ల ఫోటో, నల్లాతో కూడిన యజమాని ఫోటో దించి ప్రత్యేకమైన అప్లికేషన్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో భగీరథ పరిస్థితి తెలిసి సమగ్రత పెరిగే అవకాశం ఉంది.

గృహాల వారిగా చివరి దశకు సర్వే

గృహాల వారీగా చేపట్టిన మిషన్ భగీరథ సర్వే చివరి దశకు వచ్చినట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఇప్పటికే డివిజన్ల వారీగా పంచాయతీ సెక్రటరీలకు, సిబ్బందికి జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి సర్వేపై అవగాహన కల్పించారు. సర్వేలో ఎటువంటి తప్పులు లేకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలో నిర్దేశించిన లక్ష 15 వేల గృహాల్లో ఇప్పటికే 96,000 పూర్తి చేసుకొని 84 శాతం సర్వే పూర్తయింది. మరో రెండు మూడు రోజుల్లో సర్వే పూర్తికానున్నట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలో 1,15,836 గృహాల లక్ష్యం

మిషన్ భగీరథ సర్వేలో భాగంగా జిల్లాలో 15 మండలాల్లో 1,15,836 గృహాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిలో బుధవారం సాయంత్రం నాటికి 96717 గృహాల సర్వే పూర్తి చేశారు. వీటిలో మండలాల వారిగా చూసినట్లయితే...

రెండు రోజుల్లో సర్వే పూర్తవుతుంది

బిక్షపతి, జిల్లా పంచాయతీ అధికారి



మిషన్ భగీరథ పథకం పరిస్థితి గురించి ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే రెండు రోజుల్లో పూర్తవుతుంది. ఇండ్లలో నల్ల పరిస్థితి కుటుంబ వివరాలను సర్వేలో నమోదు చేస్తున్నాం. నల్ల కనెక్షన్ ఉంటే ఫోటో అప్పటికప్పుడు ఆన్‌లైన్ అప్‌లోడ్ చేస్తున్నాం. సర్వే మొత్తం కూడా వేగంగా పారదర్శకంగా చేస్తున్నాం.

నూతన లేబర్ కోడ్లను రద్దు చేయాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి చాంద్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కార్మికుల పొట్ట కొట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి పాత చట్టాలను అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి చాంద్ పాషా డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర నాయకుడు బ్రహ్మానందంతో కలిసి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ దాసరి వేణుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం 44 కార్మికచట్టాలను మార్చి4 లేబర్ కోడ్స్‌ను తీసుకు రావడం కార్మిక వర్గానికి చాలా ప్రమాదకరమన్నారు. దేశానికి లక్షల కోట్ల లాభాలను సమకూర్చి పెట్టే ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, బ్యాంకింగ్, ఫెయిల్, గేయెల్ కోల్ ఇండియా, ఎల్ఐసీ, నౌకాయానం లాంటి ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ఆదాని, అంబానికి అప్పజెప్పి కార్మికులు చట్టాల అమలుకు, హక్కుల కోసం మాట్లాడకుండా చేయడం కోసం మాత్రమే బీజేపీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందన్నారు. కేంద్రం వెంటనే లేబర్ కోడ్ రద్దు చేయాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేస్తున్నట్టు తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వాన్ని పంపించాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు శ్రీనివాస్, పోశం, మహేష్, చందు, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, జిల్లా నాయకులు హరిశ్చంద్ర ప్రసాద్, సత్యశ్రీ, లత, సంగీత, సలీం, కవిత పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

స్వచ్ఛందంగా భూములు వదులుకోవాలి



పోడు రైతులతో మాట్లాడుతున్న అటవీ శాఖ అధికారులు

నవతెలంగాణ-బెజ్జూర్

పోడు సాగు చేసుకుంటున్న రైతులు స్వచ్ఛందంగా భూములను వదులుకోవాలని, లేకపోతే ఆ భూముల్లో మొక్కల పెంపకానికి చర్యలు తీసుకుంటామని బెజ్జూరు రేంజ్ అధికారి దయాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన పోడు రైతులతో మాట్లాడారు. మండలంలోని చిన్న సిద్దాపూర్, పాపన్నపేట, పెద్ద సైదాపూర్ శివారులోని పోడు భూముల్లో మొక్కలు పెట్టేందుకు సిద్ధం చేస్తున్నామని, రైతులు స్వచ్ఛందంగా భూములు వదులుకోవాలని రైతులకు సూచించారు. దీంతో రైతులు తమ భూములను లాక్కోవద్దని 40 ఏండ్లుగా పోడు భూములను నమ్ముకొని వ్యవసాయం చేస్తూ కుటుంబ పోషణ చేస్తున్నామని వాపోయారు. ఉన్న భూములను తీసుకుంటే తమ జీవనాధారం భారం అవుతుందని అధికారులు ఈ విషయంలో న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

చిన్నపాటి వర్షానికి చిత్తడి

- రోడ్లపై నిలిచిన నీరు ఇబ్బంది పడ్డ ప్రజలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో గురువారం మధ్యాహ్నం అరగంట పాటు కురిసిన సాధారణ వర్షానికి జిల్లా కేంద్రం చిత్తడిగా మారింది. సరైన రహదారులు లేకపోవడం, డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం, ఉన్న రహదారుల నిర్వహణ లేకపోవడంతో ఎక్కడికక్కడ నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్, ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా, జూబ్లీ మార్కెట్ వెళ్లే రహదారి పక్కన నీళ్ళు నిల్వ ఉండడంతో ప్రజలకు కష్టలు తప్పలేదు. అలాగే జిల్లా కేంద్రంలోని సందీప్ నగర్‌లో మురుగునీరు ప్రధాన రహదారిపై పారడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. చిన్నపాటి వర్షానికి జిల్లా కేంద్రం చిత్తడిగా మారడంతో రానున్న రోజుల్లో అధిక వర్షాలు నమోదు అయితే పరిస్థితి ఏ విధంగా ఉంటుందనేదానిపై పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో రోడ్లతో పాటు డ్రైనేజీ వ్యవస్థ సరిదిద్దాల్సిన బాధ్యత అటు ప్రభుత్వాలు, ఇటు అధికారులపై ఉన్నప్పటికీ అటువంటి అభివృద్ధి పనులు ఏమి జరుగుతున్నట్లు కనిపించడం లేదు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ నుండి ఏఆర్ హెడ్ క్వార్టర్స్ వరకు రెండు వైపులా డ్రైనేజీని ఆక్రమించి టేలాలు నిర్మించడంతో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతుంది.



సందీప్ నగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

గతంలో అధికారులు వీటిని తొలగించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం మున్సిపాలిటీగా మారడంతో ఇప్పటికైనా రహదారుల డ్రైనేజీల రూపురేఖలు మారాలని అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలంలో నీరు నిలవకుండా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారనేది వేచి చూద్దాం.

కేంద్ర ప్రభుత్వ నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణం

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



నవతెలంగాణ-పెంచికల్ పేట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం శ్రీ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడుతున్నట్లు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పీఎం శ్రీ పథకంలో భాగంగా అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కొన్ని పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపడుతున్నామని, విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దుగుంట రాజన్న, బీజేపీ మండల అధ్యక్షుడు మధుకర్, జిల్లా ఓబీసీ మోర్చా నాయకులు చెప్పడే సత్యనారాయణ, నాయకులు కాంతారావు, చెప్పిడే రవి, మహేష్, సత్యం, నానయ్య, నాగేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ రోహిత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు కళ్యాణలక్ష్మీ షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. లబ్దిదారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు సంతల వేలం పాట

మండలంలోని ఇందానీ, సోనాపూర్, గోయగాప్ గ్రామాల వారసంతల వేలం పాట నిర్వహించడం జరుగుతుందని పంచాయతీ అధికారి ఖాజా అజీజ్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఇందానీ వారసంత, సోనాపూర్ వారసంత వేలం పాటతో పాటు శనివారం గోయగాప్ పశువుల సంతకు వేలం పాట నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దీనికి సంబంధించిన వివరాల కోసం ఆయా గ్రామ పంచాయతీల్లో సమాచారం ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. సంతలో పాల్గొనే వారు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వారం రోజుల నుండి రోజువారీగా మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా జడ్జి ఎంవీ రమేష్, కలెక్టర్ వెంకటేష్, జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ చేతుల మీదుగా విజేతలకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమకు కలిగిన అవగాహనతో ఇతరులను చైతన్యవంతులను చేయాలన్నారు. వక్తృత్వ పోటీల్లో ఉన్నత పాఠశాల స్థాయిలో కౌటాల జడ్పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి కే సాయికృష్ణ ప్రథమ బహుమతి పొందగా, జిల్లా కేంద్రంలోని జనకాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని దివ్యశ్రీ ద్వితీయ బహుమతి పొందింది. కళాశాల స్థాయిలో ఆసిఫాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న నైతిక్ ప్రథమ బహుమతి పొందగా రెబ్బెన సాంఘిక సంక్షేమ గురుకులంలో చదువుతున్న జయరాణి ద్వితీయ బహుమతి పొందింది.వ్యాసరచనలో ఉన్నత పాఠశాల స్థాయిలో జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదువుతున్న సాంగ్డే మీనాక్షి ప్రథమ బహుమతి, కౌటాల ఉన్నత పాఠశాల సాయికష్ణ ద్వితీయ బహుమతి, కళాశాల స్థాయిలో సాంఘిక సంక్షేమ గురుకులం రెబ్బెన విద్యార్థిని సుజాత ప్రథమ బహుమతి, జనకాపూర్ కేజీబీవీలో చదువుతున్న మహేశ్వరి ద్వితీయ బహుమతి, చిత్రలేఖన పోటీల్లో ఉన్నత పాఠశాల స్థాయిలో గంగాపూర్ విద్యార్థి రామ్ చరణ్ ప్రథమ బహుమతి పొందగా, జిల్లా కేంద్రంలోని టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ విద్యార్థి రిషిత్ ద్వితీయ బహుమతి పొందారు. జూనియర్ కళాశాల స్థాయిలో సాంఘిక సంక్షేమ గురుకులం రెబ్బెన విద్యార్థిని శ్రీవల్లి ప్రథమ బహుమతి, డ్రామా పోటీల్లో ఉన్నత పాఠశాల స్థాయిలో టీడబ్ల్యూ ఎంఎస్ఎస్ విద్యార్థిని భూమిక ప్రథమ బహుమతి, బెజ్జూర్ పాఠశాల విద్యార్థి విశ్వనాథ గౌడ్ ద్వితీయ బహుమతి, జూనియర్ కళాశాల స్థాయిలో రెబ్బెన విద్యార్థిని పావని ప్రథమ బహుమతి, డిబేట్ పోటీల్లో ఉన్నత పాఠశాల స్థాయిలో కౌటాల పాఠశాల విద్యార్థి సాయి కృష్ణ ప్రథమ బహుమతి, గన్నారం ఎంజేపీ విద్యార్థిని నిహారిక ద్వితీయ, కళాశాల స్థాయిలో రెబ్బెన గురుకుల విద్యార్థిని జయరాణి ప్రథమ బహుమతి, జనకాపూర్ డబ్ల్యూఆర్ఎస్ జెసి విద్యార్థి రాహుల్ ద్వితీయ బహుమతి పొందారు.

హత్య ప్రయత్నం కేసులో ఐదుగురికి జైలు

నవతెలంగాణ-దహెగాం

పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన హత్యయత్నం కేసులో ఐదుగురికి మూడేండ్ల జైలుతో పాటు ఒక్కొక్కరికి రూ.మూడు వేల జరిమాన విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్ తీర్పు ఇచ్చినట్టు ఎస్సై రాజు తెలిపారు. 28జూలై2021న మొట్లగూడ గ్రామ శివారులో షేక్ ఇరాజ్ తండ్రి షఫీక్‌తో కలిసి తమ పట్టా భూమికి సాగు కోసం వెళ్లాడు. కోవ ముత్తయ్య, కోవ కిరణ్, కోవతిరుపతి, కోవలింగు బాయి, కోవ ప్రేమ్ సాగర్‌లు దాడికి పాల్పడ్డారు. దీనిపై ఇరాజ్ ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్సై రఘుపతి కేసు నమోదు చేశారు. ఈకేసులో నిందితులను కోర్టులో ప్రవేశపెట్టి రుజువు చేయడంతో ఐదుగురికి జడ్జీ మూడేండ్ల జైలుతో పాటు ఒక్కొక్కరికి రూ.మూడు వేలు జరిమాన విధిస్తు తీర్పు ఇచ్చారని తెలిపారు.

కెరమెరి తైబజార్‌కు వేలం

నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో తైబజార్ వేలం పాట పాడారు. ఈ వేలంలో పాటలో ఐదుగురు వ్యక్తులు పాల్గొన్నారు. సకరాం గూడ కాలనీకి చెందిన రాథోడ్ సాగర్ రూ.1,87500 వేలం పాడి తైబజార్ దక్కించుకున్నారు. ఈ తైబజార్ జులై నుండి వచ్చే మార్చి వరకు(తొమ్మిది నెలలు) మాత్రమేనని పంచాయతీ కార్యదర్శి భీమన్న తెలిపారు.

బదిలీపై వెళ్తున్న ఏఎన్ఎమ్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని మేదర్పేట పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్రంలో మొదటి ఏఎన్ఎంగా విధులు నిర్వహించి పదోన్నతిపై హెల్త్ సూపర్వైజర్‌గా బదిలీపై వెళ్తున్న ఏఎన్ఎం శ్యామలకు ఎంపీటీసీ కొంగుల నవీన్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. అనంతరం ఎంపీటీసీ నవీన్ పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా గ్రామానికి ఎనలేని సేవలు చేశారని ఆమె మంచితనం ఎప్పటికీ మర్చిపోలేని పదోన్నతిపై వెళుతున్న సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో ఆమె వృత్తిలో మరింత ఉన్నత స్థాయిలో ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చొప్పదండి రమేష్ స్థానిక నాయకులు గందే శ్రీనివాస్, పిట్టల రాజన్న, వినయ్, సతీష్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

నవతెలంగాణ-జన్నారం



దండేపల్లి మండలంలోని తాళ్లపేట గ్రామానికి చెందిన కుందారపు రఘు(26) మానసిక పరిస్థితి బాగా లేక మనస్థాపానికి గురై జీవితంపై విరక్తితో ఈ నెల 25న మండలంలోని ధర్మారం వెళ్లే ప్రధాన రహదారి ఈద్గా వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు రాఘవ కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో, కుటుంబ సభ్యులు రఘుని చికిత్స నిమిత్తం లక్షెట్టిపేట్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి కరీంనగర్ అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఈ నెల 26న మరణించాడు. తండ్రి కుందారపు చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజ వర్ధన్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల ధ్యేయం



నవతెలంగాణ-దండేపల్లి

శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా పోలీసులు పనిచేస్తున్నారని శాంతి పద్ధతుల పరిరక్షణ అసాంఘిక శక్తుల కట్టడి కోసం గ్రామాల్లో రాత్రి బస చేస్తున్నామని దండేపల్లి ఎస్ఐ భూమేష్ తెలిపారు. బుధవారం రాత్రి మండలంలోని తాళ్ల పేట గ్రామంలో పోలీసులు రాత్రి నిద్ర చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ భూమేష్ మాట్లాడుతూ ప్రజల రక్షణ భద్రత కొరకు ఎప్పుడు పోలీసులు అందుబాటులో ఉంటారని భరోసా కల్పిస్తూ కట్టడం లో శాంతిభద్రల పరిరక్షణ కొరకు గ్రామస్తులు సహకరించాలని ఆయన కోరారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉండాలని స్నేహభావంతో ఉండాలని తమకు ఏవైనా సమస్యలు ఉంటే పోలీసులకు సంప్రదించాలని యువత ఉద్దేశించి అన్నారు. గంజాయి మత్తు పదార్థాల నివారణకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా చదువుపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. గ్రామాలలో ఎవరైనా అనుమాదాస్పద వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు.

తాండూర్ : ప్రజా సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరిస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు పోలీసు శాఖ గ్రామాల్లో నైట్ హాల్ట్ కార్యక్రమం చేపట్టిందని మాదారం ఎస్ఐ అనూష తెలిపారు. ఆమె బుధవారం పోచంపల్లి గ్రామంలో పోలీస్ నైట్ హాల్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తులతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉంటూ అసాంఘిక శక్తులను కట్టడి చేయడమే లక్ష్యంగా మారుమూల గ్రామాల్లో నైట్ హాల్ట్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన టీబీజీకేఎస్ నాయకులు



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సమస్యలపై మాజీ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాదులోని తెలంగాణ భవన్‌లో గురువారం 11 ఏరియాల నుండి తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు, కేంద్ర నాయకులు, కోల్డ్ బెల్ట్ లోని బీఆర్ఎస్ ఇన్‌చార్జీలతో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలోని బొగ్గు గనులను, సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం వేలం ప్రక్రియను నిర్వహించడాన్ని, దీనికి మద్దతు తెలుపుతున్న రాష్ట్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా భవిష్యత్తులో చేపట్టబోయే నిరసనలు, పూర్తిగా ఇట్టి వేలాన్ని నిలుపుదల చేసేవరకు ఆ బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించే వరకు దశల వారి పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కెటీఆర్ పిలుపునిచ్చినారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్, మాజీ ఎంఎల్ఏ నడిపెల్లి దివాకర్ రావు, బీఆర్ఎస్ నాయకులు విజిత్‌రావు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, కేంద్ర కమిటీ నాయకులు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, పెట్టం లక్ష్మణ్, పొగాకు రమేష్, పానుగంటి సత్తయ్య, అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవాపూర్‌లో పిల్లలకు ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో మంచిర్యాల శ్రీ రామ పిల్లల ఆస్పత్రి సహకారంతో గురువారం పిల్లలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఓరియంట్ కంపెనీ యునిట్ హెడ్ మహేంద్ర ప్రతాప్ జోషి, హెచ్ఆర్ జీఎం అనంద్ కులకర్ణి ప్రారంభించారు. ఈ శిబిరంలో 63 చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. ఈ సందర్భంగా ఓరియంట్ కంపెనీ యునిట్ హెడ్ మహేంద్ర ప్రతాప్ జోషి, హెచ్ఆర్ జీఎం అనంద్ కులకర్ణి మాట్లాడుతూ ఓరియంట్ ఆధ్వర్యంలో తమ వంతు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ పిల్లల ఆస్పత్రి డాక్టర్ రాజేష్, ఓరియంట్ డాక్టర్స్ నవీన్, వంశీ, ఝాన్సి, సాయి ప్రకాష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల లేకుండా చూడాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని హాజీపూర్ మండలం ఎల్లంపల్లిలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, మిషన్ భగీరథ ఇంటెక్‌వెల్‌లను మిషన్ భగీరథ ఈఈ మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి మిషన్ భగీరథ ద్వారా ప్రాజెక్టు పరిధిలోని నివాసాలకు ఎలాంటి అంతరాయం లేకుండా తాగునీటిని సరఫరా చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గుతున్నందున మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాలకు తాగునీటిని అందించేందుకు మిషన్ భగీరథ ఇంటెక్వెల్‌నకు గోదావరి నీటిని సరిపడా అందించడం కొరకు ఎల్లంపల్లి రిజర్వాయర్ నుండి ఇంటెక్వెల్ వరకు కాలువ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



పేదల గుడిసెలు కూల్చివేత

- నిరాశ్రయులైన ఆదివాసి, దళితులు

నవతెలంగాణ-జైపూర్



చెన్నూర్ మండలం బావురావుపేట్ శివారులో గల ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలు కూల్చేశారు. పట్టాలు పంపిణీ చేయాలని పోరాడుతున్న పేదలకు నిలువ నీడ లేకుండా పోయింది. ఏడాదిన్నర క్రితం గుడిసెలు వేసుకున్న గుడిసెలను గురువారం పట్టాదారులమని చెప్పుకుంటున్న వారు కూల్చేశారు. గత ప్రభుత్వ హయాంలో గుడిసెలు వేసుకున్న ఆదివాసి, దళిత, వెనుకబడిన, మైనార్టీలకు చెందిన పలువురు ఇక్కడ గుడిసెలు వేసుకున్నారు. గుడిసెలు వేసుకున్న స్థలాలకు పట్టాలు పంపిణీ చేయడంతో పాటు ప్రభుత్వ పరంగా ఇండ్లు మంజూరు చేయాలని పోరాడుతుండగా ఊహించని విధంగా వచ్చి గుడిసెలు కూల్చేడంతో పేద కుటుంబాల వారికి ఆశ్రయం లేకుండా పోయింది. వందలాది మందితో వచ్చి ప్రొక్లైనర్లు, ట్రాక్టర్లతో గుడిసెలను కూలదోశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో పేదల ప్రభుత్వం వచ్చింది. ఏడాదిన్నర కాలంగా గుడిసెల్లో నివాసముంటుండగా ఊహించకుండా వచ్చి గుడిసెలు కూల్చి గుండా గిరీ ప్రదర్శించారని బాధితులు వాపోతున్నారు. తమకు జరిగిన అన్యాయం పట్ల ప్రభుత్వ అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

గుండా గిరీ చేయడం సరికాదు : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చడంతో దళిత, ఆదివాసి, వెనుకబడిన, మైనార్టీ కుటుంబాలపై గుండా గిరీ చేయడం సరికాదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి ఆవేదన వ్యక్తం చేశారు. సుమారుగా 300 మంది గుడిసెల వద్దకు వచ్చి నిర్దాక్షన్యంగా కూల్చివేసిన వారిపై ప్రభుత్వ అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని పేర్కొన్నారు. చెన్నూర్ శివారులో భూకబ్జాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా పట్టాలు పంపిణీ చేస్తారని ఆశించిన పేదలకు తీవ్రమైన అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దాడి చేసి గుడిసెలు తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు నిరాశ్రయులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాది నుండి పోరాడుతున్న పేదలకు న్యాయం చేయాల్సిన అధికారులు కబ్జాదారులకు ఊడిగం చేస్తున్నట్లు కన్పిస్తుందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఇక్కడి ఎమ్మెల్యే పేదలను పట్టించుకోకపోగా ప్రస్తుత ఎమ్మెల్యే కూడా పేదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, అక్రమ పట్టాలు పొందిన వారు ఆక్రమించుకున్న భూమిని పేదలకు పంచాలని సీపీఐ(ఎం) విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ఏదైనా మాకేంటి అడ్డు అని భావించిన కబ్జాదారులు పేదలు వేసుకున్న గుడిసెలను దుర్మార్గంగా కూల్చి వేసిన తీరుపై ఎమ్మెల్యే వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. సంకె రవితోపాటు సీపీఐ(ఎం) నాయకులు బ్రహ్మయ్య, కావిరి రవి, అనిల్, సిడం సమ్మక్క, ఉమారాణి, రేణుక, రాజేశ్వరి, భూదేవి, సరిత, రమాదేవి, నాగజ్యోతి, శ్రీనివాస్, కృష్ణ, ఎల్లక్క పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి అధికారులు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం నస్పూర్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, మున్సిపల్ చైర్మన్ సురిమిళ్ళ వేణుతో కలిసి కార్యాలయంలోని వివిధ విభాగాలతో పాటు ప్రజాపాలన సేవా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను అధికారులు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వార్డులలో మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వీధి దీపాల నిర్వహణ పకడ్బందీగా ఉండేలా చూడాలని తెలిపారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువలలో పూడిక లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, పారిశుధ్య నిర్వహణలో భాగంగా డ్రైడే కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్దిదారులకు పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రజాపాలన సేవా కేంద్రానికి వచ్చే దరఖాస్తుదారుల సందేహాలు నివత్తి చేయాలని తెలిపారు. డంపింగ్ యార్డును సందర్శించి ప్రతి రోజు మున్సిపల్ పరిధిలోని ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని నర్సరీని సందర్శించి మొక్కలు నాటేందుకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



టెలికాం వినియోగదారుల హక్కులు, అధికారాలపై అవగాహన



నవతెలంగాణ-నస్పూర్

టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(టీఆర్ఏఐ) వారి ఆధ్వర్యంలో టెలికాం వినియోగదారులకు వారి హక్కులు, అధికారాలు, జాగ్రత్తలు గురించి గురువారం సింగరేణి గెస్ట్ హౌస్‌లో అవగాహన కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ అడ్వైజర్ కేవీ సురేశ్ బాబు మాట్లాడుతూ టెలికాం వృద్ధి వినియోగదారుల ప్రయోజనాలను సురక్షితంగా కాపాడటంలో ట్రాయ్ పాత్రను వివరించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియా ట్రాయ్, ఆర్ఓ, హైదరాబాద్ వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తమ సంస్థను ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవడం ద్వారా విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించడానికి తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. హైదరాబాద్ (తెలంగాణ, తమిళనాడు) ప్రాంతీయ కార్యాలయ సలహాదారులు బి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రాంతీయ కార్యాలయం పాత్ర, విధులు, టెలికాం వినియోగదారుల రక్షణ కోసం చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. మొత్తం పర్యావరణ వ్యవస్థ అభివృద్ధి చెందడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులను ప్రోత్సహించడానికి సరైన విధానం, నియంత్రణ ఫ్రేమ్ వర్క్‌ను ఉంచడానికి ట్రాయ్ పనిచేస్తుందని పేర్కొన్నారు. ట్రాయ్ చేపట్టిన 5జీ టెక్నాలజీ, కార్యక్రమాల గురించి ఆయన ప్రస్తావించారు. ఈఎంఎఫ్ రేడియేషన్, డిజిటల్ మోసాలు, 5జీ టెక్నాలజీ వినియోగం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం ఐఈడి చిరంజీవిలు, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ ఎం వెంకటపతి, సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్ అధ్యాపకులు మూర్తి, రవీందర్ పాల్గొన్నారు.

పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

నవతెలంగాణ-జన్నారం



బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం కరీంనగర్ జోన్ కన్వీనర్ కేపీ నరసింహులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు గడిచినప్పటికీ కాంగ్రెస్ 55 సంవత్సరాలు పరిపాలించిన సమయంలో వాళ్ల రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా ఓబీసీలు అభివృద్ధి చెందకుండా పరిపాలన చేస్తూ వచ్చారని అన్నారు. దేశంలో బీసీ సమాజం చైతన్యానికి సంఘాలు తీవ్రంగా కృషి చేస్తున్నందున ఇప్పుడు ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఓబీసీలలో చైతన్యం వెల్లివిరిసిందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఓబీసీకుల జన గణన చేస్తామంటూ పదేపదే ప్రకటించినందు వలన చైతన్యవంతులైన జనం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినారని బీజేపీకి సుమారు 60 స్థానాల్లో వ్యతిరేక ఫలితాలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోదూరి చంద్రయ్య, కో కన్వీనర్ కడార్ల నరసయ్య, మంచిర్యాల జిల్లా బీసీ కేయూపీఎస్ కన్వీనర్ ఆడేపు లక్ష్మీనారాయణ, మండల బీసీ సంఘం అధ్యక్షుడు కానిగంటి లక్ష్మణ్ వర్మ, ఉపాధ్యక్షుడు గూడ అశోక్, విశ్వకర్మ సంఘం నాయకులు దోనోజు శ్రీనివాస్, రాంచందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ



నవతెలంగాణ-మందమర్రి

ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం మందమర్రి జడ్పీహెచ్ఎస్ బాయ్స్ హై స్కూల్ విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మందమర్రి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శశిధర్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులంతా బాగా చదువుకొని ఉన్నతమైన స్థానానికి వెళ్లాలన్నారు. చెడు మార్గంలో ఎవరు వెళ్లొద్దని తెలిపారు. ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ చేసే సేవా కార్యక్రమాలను సభ్యుల్ని అభినందించారు. అనంతరం వ్యవస్థాపన అధ్యక్షుడు షేక్ ఆజీమోద్దీన్ మాట్లాడుతూ యువత చెడు మార్గంలో వెళ్లకుండా మంచి వైపు వెళ్తూ బాగా చదువుకుంటూ ఉన్నతమైన స్థానంలో ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభు దేవ్, పట్టణ అధ్యక్షుడు నంది పాట రాజ్ కూమార్, కార్యదర్శి గాండ్ల సంజీవ్, ఎండీ జావిద్ పాషా, సుందర్, అజయ్, చింటూ గణేష్ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి దుబాయి శాఖ ప్రెసిడెంట్ అలీం కోరారు. గురువారం మండలంలోని కవ్వాల్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన గల్ఫ్ కార్మికుని అంబటి అనంతయ్య కుటుంబానికి సంక్షేమ సమితి ఆధ్వర్యంలో రూ.20,0000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి ఉపాధి వేటలో అసువులు బాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ యజమాని మృతి చెందడం వల్ల కుటుంబం రోడ్డున పడుతుందని దిక్కులేని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన చెందారు. గల్ఫ్ కార్మికుల కుటుంబాలను గుర్తించి ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేసి రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర జిల్లా నాయకులు అమరకొండ తిరుపతి, మగ్గిడి తిరుపతి పరకల మహేష్, హస్సెన్, సంద సుదర్శన్, దుమ్మల ఎల్లయ్య, అంజి, రజలింగు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిపై ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రటరీ కారుకురి తిరుపతి ఆధ్వర్యంలో గనిలో నెలకొన్న పలు సమస్యలపై గని ఇన్‌చార్జి మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రటరీ తిరుపతి మాట్లడుతూ గత కొద్ది రోజులుగా కార్మికులు సరైన గాలి లేక తాగడానికి నీరు లేక పని స్థలాలలో ఇబ్బంది పడుతున్నారని, అలాగే మ్యాన్ రైడింగ్ పనులు పూర్తి ఐనా ప్రారంభానికి నోచుకోలేదని, మ్యాన్ రైడింగ్ పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు. గని మేనేజర్ లీవ్‌లో ఉన్న కారణంగా సేఫ్టీ ఆఫీసర్‌ని సంప్రదించగా సేఫ్టీ ఆఫీసర్ తక్షణమే స్పందించి సమస్యలను మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి త్వరగా ఈ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ చింతం రవి కిరణ్, సీనియర్ నాయకులు పరమేష్, సత్తయ్య, అచ్చె ప్రదీప్, రమేష్, తిరుపతి, పిరిసింగుల రాజు, నక్క హరీష్, కమల్, జగన్ దినేష్, షఫీ పాల్గొన్నారు.

ప్రారంభం అయిన బ్యాడ్మింటన్ పోటీలు

నవతెలంగాణ-మంచిర్యాల

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూనిక్స్ సన్ రైస్ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు మంచిర్యాలలోని గ్రీన్ సిటీలో గల మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ప్రారంభం అయ్యాయి. గురువారం జరిగిన క్వాలిఫైయింగ్ రౌండ్‌లో మెన్ సింగిల్స్‌లో 69 మంది పాల్గొనగా 12 మంది, ఉమెన్ సింగిల్స్‌లో 23 మంది పాల్గొనగా 6 మంది, మెన్ డబుల్‌లో 23 మంది పాల్గొనగా 6 మంది క్రీడాకారులు మెయిన్ డ్రాకు అర్హత సాధించారు. శుక్రవారం నుండి 30వ తేదీ ఆదివారం వరకు మెయిన్ డ్రా క్రీడాకారులకు పోటీలు జరగనున్నాయి. శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి అందరూ పాల్గొనాలని టోర్నమెంట్ అర్గనైజింగ్ సెక్రటరీ పుల్లూరు సుధాకర్ తెలిపారు. బ్యాడ్మింటన్ పోటీలను టోర్నమెంట్ అబ్జర్వర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జాయింట్ సెక్రటరీ యువీఎస్ బాబు పర్యవేక్షిస్తున్నారు. రిఫరీ మల్లికార్జున్, మ్యాచ్ కంట్రోలర్ కుమార్, ఎంపైర్లు మ్యాచ్‌లకు నిర్వాహకులుగా వ్యవహరిస్తున్నారు.

పారిశుధ్య పనులు నిత్యంనిర్వహించాలి

నవతెలంగాణ-నేరడిగొండ



వర్ష కాలం ప్రారంభమైన నేపథ్యంలో కార్మికులు నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీఓ రాజ్‌వీర్ సూచించారు. గురువారం మండలంలోని లింగట్ల గ్రామంలో పర్యటించారు. కొన్ని నెలలుగా ఇక్కడ పారిశుధ్య పనులు జరగడం తెలుసుకున్న పనులను చేయాలని ఆదేశించారు. దోమలు, ఈగలు వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని, వాటిని నివారించేందుకు మురుగు కాలువల్లో ఫాగింగ్, స్ప్రే చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు.

పత్రాలు లేకుండా వాహనాలు నడపకూడదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వాహనాలకు అవసరమైన పత్రాలు లేకుండా రోడ్డుపై వాహనదారులు నడపకూడదని స్థానిక సీఐ సతీష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఎస్సైలు ప్రవీణ్ కుమార్, రాజేశ్వర్లతో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. అనంతరం వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పత్రాలు లేకుండా వాహనాలు నడపకూడదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

సంపూర్ణత అభియాన్‌తో అభివృద్ధి సాధ్యం

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో సంపూర్ణత అభియాన్ పథకంతో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. నీతి అయోగ్ ఆధ్వర్యంలో జులై 1 నుండి ప్రారంభించనున్న వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పథకమైన సంపూర్ణత అభియాన్‌పై నీతి అయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి బీవీఆర్ సుబ్రహ్మణ్యం పథకం అమలు చేసే జిల్లాల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీతి అయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మాట్లాడుతూ దేశంలో 112 జిల్లాల్లో పథకం ప్రారంభించనున్నట్లు తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పథక లక్ష్యమని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పలుశాఖల సహకారంతో సంపూర్ణ అభియాన్ పథకంలో భాగంగా జిల్లాలోని ప్రతి గ్రామంలోని 30 ఏండ్లపై బడిన వారికి డయాబెటిస్, హైపర్టెన్షన్ వంటివాటిపై రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా గర్భిణుల సంఖ్యను ముందుగానే తెలుసుకుని ప్రాథమిక దశ నుండే వారికి పోషకాహారం, మందులు సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లాలో జులై 4న కలెక్టర్ కార్యాలయంలో సంపూర్ణత అభియాన్ పథకాన్ని ప్రారంభించనున్నట్లు, అదే రోజున తిర్యాణిలో ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఉద్యానవన ఏడీ క్రిష్టారెడ్డి, అడిషనల్ డీఆర్డీఓ రామకృష్ణ, ఇన్‌చార్జి ముఖ్యప్రణాళికా అధికారి పాపయ్య, ఆస్పిరేషనల్ బ్లాక్ కోఆర్డినేటర్ మణివేల్ పాల్గొన్నారు.

కరుణించిన వరుణుడు

- రైతన్నలో చిగురించిన ఆశలు



నవతెలంగాణ-చింతలమానేపల్లి

వర్ష కాలం ప్రారంభమైన ఆశించిన మేరకు వర్షాలు లేక రైతులు ఆందోళనకు గురయ్యారు. కురిసిన వర్షంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేశారు. గురువారం ఒక్కసారి భారీ వర్షం పడడంతో విత్తిన విత్తనాలకు ప్రాణం పోసినట్టు అయింది. మొలకెత్తిన విత్తనాలు అర్ధడ కార్తిలో వర్షాలు లేక ఎండవేడికి మొక్కలు చనిపోయాయి. వాన కాలం మొదలైన ఇంకా వర్షాలు కురువక అన్నదాతలు వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తూ వర్షాలు కురవాలని ఆయా గ్రామాలలో కప్పతల్లి ఆటలు, గ్రామ దేవతలకు పూజలతో వేడుకున్నారు. గురువారం మండలంలో కురిసిన వర్షానికి రైతన్నలు సంతోషం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి క్రీడ పాఠశాల ఎంపిక పోటీలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో గల మూడు క్రీడా పాఠశాలల (హకింపేట్, కరీంనగర్, ఆదిలాబాద్)లో కోసం ఎంపిక పోటీల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాల మైదానంలో నిర్వహించిన పోటీలను జిల్లా యువజన క్రీడల అధికారిని రమాదేవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 2024-25 సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న బాల, బాలికలకు నిర్వహించిన క్రీడ పోటీలలో జిల్లాలోని 27 మంది పాల్గొన్నారన్నారు. ఇందులో అత్యంత ప్రతిభ కనబరిచిన వారిని జులై 8న హకీంపేట్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడ పాఠశాల ఎంపిక పోటీలకు పంపిస్తామని తెలిపారు. గత సంవత్సరం నిర్వహించిన క్రీడా పాఠశాలల పోటీలలో జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమ్, ఇందిరా, గుండం లక్ష్మణ్, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ



నవతెలంగాణ-తాండూరు

తాండూర్ గ్రామంలోని హైస్కూల్ వెనుక నుంచి మసీదు వరకు సీసీ రోడ్ పనులకు గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈసా ప్రారంభించారు. రూ. ఐదు లక్షల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సిరంగి శంకర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అక్రముల్లా ఖాన్, ఆదం ఖాన్, షజి ఖాన్, రుస్తాం ఖాన్, నియాజాలిఖాన్ పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వర్షాకాలం నేపథ్యంలో అధికారులంతా మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా, జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వరరావు, డీఎస్పీ సదయ్యలతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారులు, నీరు, విద్యుత్ వంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. అధికారులు సమన్వయం చేసుకుంటూ రహదారుల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. పూర్తికాని రహదారులు, వంతెనల పనులను వెంటనే చేపట్టాలన్నారు. అలాగే గ్రామాల్లో విద్యుత్ నిరంతరం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ సౌకర్యం లేని గ్రామాల్లో సౌర విద్యుత్‌ను అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల వల్ల విద్యుత్ సౌకర్యానికి ఇబ్బందులు వస్తే వెంటనే పునరుద్ధరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యుత్ సౌకర్యానికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వర్షాకాలంలో నీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. పైపులకు లీకేజీలుంటే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. పోలీసు అధికారులు వరదల సమయంలో నిత్యం జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎమర్జెన్సీ బృందాలను అప్రమత్తం చేసి వరద నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడాలి

అధికారులు పరిశ్రమల ఏర్పాటుకు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

అనుమతులిచ్చి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రఘు, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ సజీవన్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, ఎల్డీఎం జోషి, డీటీఓ రాంచందర్‌తో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన టీజీ ఐ పాస్ ద్వారా పలు పరిశ్రమలకు వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా పొందిన అనుమతులను పరిశీలించారు. పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు ఇచ్చి పారిశ్రామిక రంగ అభివృద్ధికి తోడ్పడాలని అధికారులకు సూచించారు. సేవారంగానికి సంబంధించి 5 ఎస్సీ యూనిట్లకు రూ. 17.96 లక్షలు, 2 ఎస్టీ యూనిట్లకు రూ.7.56 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న అటవీశాఖ గెస్ట్ హౌస్



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని ఉదనగర్ కాలనీలో శిథిలావస్థలో ఉన్న అటవీ శాఖ గెస్ట్ హౌస్‌ను తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. గత 2 దశాబ్దాలుగా వాడుకలో లేకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఆ ఇంటి చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. చుట్టూరా చెత్త చెదారంతో అపరిశుభ్రంగా మారింది. దీంతో విష సర్పాలకు ఆవాసంగా మారింది. ఈ ఇంటి స్థలానికి ఎదురుగా కిరాయి గదిలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతుంది. అసలే వర్షాకాలం కావడంతో ఎప్పుడు కూలిపోతుందోనని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇదే భవనం పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా మంగళవారం రాత్రి సంబంధిత సిబ్బంది మరమ్మతులు చేస్తుండగా ఓ పాము కాళ్ళ మధ్య రావడంతో భయాందోళనకు గురయ్యారు. ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోక పోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఇప్పటికైనా అటవీ అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన ఇంటిని తొలగించి, ఆ స్థలాన్ని స్థానిక సంస్థలకు అప్పగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

- రామగుండం సీపీ ఎం శ్రీనివాస్

నవతెలంగాణ-నస్పూర్

దేశంలోని నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. భారతీయ న్యాయ సంహిత(బిఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బిఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం-2023పై పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి నెల రోజులపాటు నిర్వహించిన శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. అడిషనల్ డీసీపీ రాజు అధ్వర్యంలో కమీషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమీషనర్ హాజరై అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. జూలై ఒకటో తేదీ నుంచి దేశవ్యాప్తంగా బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్ చట్టాలు అమలులోకి వస్తున్నాయని అన్నారు. ప్రతీ పోలీస్ అధికారి, సిబ్బందికి కొత్త చట్టాలపై అవగాహన ఉండాలనే ఉద్దేశంతో నెల రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించామని తెలిపారు. కొత్త చట్టాలు అమలు జరిగిన వెంటనే ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన అవసరమన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధి విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలుగా ఉంటుందన్నారు. నెల రోజులపాటు సమయపాలన పాటిస్తూ అందరికీ



ప్రశంస పత్రం అందిస్తున్న సీపీ శ్రీనివాస్

అర్థమయ్యేలా తరగతులు బోధించిన ఏసీపీ మల్లారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఎస్ఐలు రాజేష్, వినీత, సంతోష్, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ పి.వంశీకృష్ణ, బి శ్రీనివాస్, కే రాము, ఏ సంతోష్, కే శ్రీనివాస్, కానిస్టేబుల్ కే తిరుపతి, ఎన్. శ్రీనివాస్ లను సిపి ప్రశంస పత్రాలు అందచేసి అభినందించారు.

సమర్థవంతంగా సేవలు అందించాలి



వీసీలో పాల్గొన్న ఎస్పీ శ్రీనివాస్, పోలీసులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నూతన చట్టాలపై ప్రతి ఒక్క పోలీస్ అధికారి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర డీజీపీ రవిగుప్త అన్నారు. నూతన చట్టాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా ఎస్పీ డివి శ్రీనివాసరావ్‌తో పాటు సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క పోలీస్ అధికారి అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా ఎస్పీ డివి. శ్రీనివాసరావు మాట్లాడుతూ జులై 1 నుండి దేశవ్యాప్తంగా కొత్త చట్టాలను అమలు చేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అందుకు అనుగుణంగా కొత్త చట్టాలను అనుసరిస్తూ ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం-2023 పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహించగలమని తెలిపారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధి విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలుగా ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ కొత్త చట్టాలను నేర్చుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఈ నూతన చట్టాలపై పోలీసు అధికారులకు సిబ్బందికి శిక్షణ తరగతులను ఏర్పాటు చేయడంలో సమన్వయాధికారిగా వ్యవహరించిన డీసీఆర్బీ సిఐ రమేష్, ఎస్బి ఎస్సై రామకృష్ణని అభినందించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, సీఐలు పాల్గొన్నారు.

'నవతెలంగాణ' కథనానికి స్పందన

- విద్యుత్ స్తంభం తొలగించారు

నవతెలంగాణ-కెరమెరి



విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని అనే శీర్షికన నవతెలంగాణ పత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. సుల్తాన్‌గూడలో ప్రధాన రహదారి పక్కన విద్యుత్ స్తంభం కుంగి పోయి, విరిగి ఉండడంతో ప్రమాదకరంగా మారింది. ఇటీవల సమస్యపై నవతెలంగాణలో కథనం ప్రచురితం అయింది. దీంతో విద్యుత్ అధికారులు పురాతన స్తంభాన్ని తొలగించారు. అదే ప్రదేశంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయడంతో సుల్తాన్‌గూడ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

నిషేధిత గుట్కా పట్టివేత

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని బొంబాయి గూడ, మొట్లగూడ గ్రామంలో గురువారం కిరాణా దుకాణాల్లో సోదాలు నిర్వహించి రూ.4500 విలువగల నిషేధిత గుట్కా పట్టుకున్నట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు సోదాలు నిర్వహించి బొంబాయి గూడ గ్రామానికి చెందిన పాగిడే రఘునాథ్, మొట్లగుడ గ్రామానికి చెందిన చౌదరి రాజన్న, పంకజ్ రాయ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. నిషేధిత గుట్కా పొగాకు విక్రయిస్తు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

29న మత్స్యకారులకు అవగాహన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో ఈనెల 29న ఉదయం 9.30 గంటలకు 2 గుంటల భూమి కలిగి ఉండి చేపల చెరువు నిర్మించుకొనుటకు ఆసక్తిగల మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల మత్స్యకారులు అవగాహన కార్యక్రమానికి హాజరై పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కాగజ్‌నగర్ ఆర్డీఓ కార్యాలయ చరాస్తుల జప్తు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాగజ్‌నగర్ ఆర్డీఓ కార్యాలయ చరాస్తులను జప్తు చేస్తూ జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్ యువరాజ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే పీపీ రావు ప్రాజెక్టు భూసేకరణ కోసం ఎకరానికి రూ.లక్ష చొప్పున 132 ఎకరాలకు డబ్బులు చెల్లించాలని గతంలో కోర్టు తీర్పు ఇచ్చి మూడు నెలలు గడువు ఇచ్చింది. ఆ లోపు ఆర్డీఓ పరిహారం చెల్లించడంలో విఫలమయ్యారని బాధితుల తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకురాగా, ఆర్డీఓ కార్యాలయ చరాస్తులను జప్తు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

ప్రయివేటు పాఠశాలల ప్రలోభాలకు గురికావొద్దు



నవతెలంగాణ-తాండూరు

ప్రయివేటు పాఠశాలల ప్రలోభాలకు గురికావొద్దని, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాల నుంచి దూరం చేయవద్దని ఎంపీడీఓ శ్రీనివాస్ కోరారు. మండలంలోని మాదారం శ్రీ ఇంక్లైన్ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు టీసీ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాల విద్య పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో రకాల వసతులు, సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని చదువులో ఉన్నతంగా రాణించాలన్నారు. మెరుగైన విద్యా బోధన అందించే ప్రభుత్వ పాఠశాలను వీడవద్దని సూచించారు. ఏమైనా లోటుపాట్లు ఉంటే పాఠశాల సిబ్బందితో మాట్లాడి సరి చేసి విద్యార్థులు చదువులో రాణించేలా చర్యలు చేపడతామన్నారు. ప్రయివేటు పాఠశాల ఆశ్రయించి ఆర్థికంగా, నష్టపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సూరం రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-జన్నారం

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు ఉమాశ్రీ, డాక్టర్ నారాయణ సూచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో మండలంలోని మురిమడుగు గ్రామంలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు రావని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కమలాకర్, పోచన్న ఏఎన్ఎం ఆశ గ్రామస్తులు పాల్గొన్నారు.

మురిమడుగుకు బెస్ట్ విలేజ్ అవార్డు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని మురిమడుగు గ్రామానికి రాష్ట్ర స్థాయిలో బెస్ట్ విలేజ్ అవార్డు లభించిందని ఎయిడ్స్ నియంత్రణ జిల్లా రిసోర్స్ పర్సన్ సరిత తెలిపారు. గురువారం మురిమడుగులో నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్నారు. గ్రామంలో ఎయిడ్స్‌ను నియంత్రించడం, కొత్త కేసులు రాకుండా చూడడంతో గ్రామానికి రాష్ట్ర స్థాయిలో బెస్ట్ విలేజ్ అవార్డు వచ్చిందన్నారు. హెచ్ఐవీ నియంత్రణలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పిడుగు పడి ఎద్దు మృతి

నవతెలంగాణ-కాసిపేట



పిడుగుపడి ఎద్దు మరణించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని వరిపేట శివారులో బుధవారం రాత్రి పిడుగు పడి బుగ్గగూడకు చెందిన ఏదుల మల్లేశ్ గిరిజన రైతుకు చెందిన ఎద్దు మృతి చెందింది. పశు వైద్యాధికారి కుర్మ తిరుపతి ఎద్దును పరిశీలించి పంచనామా నిర్వహించారు. నష్టపరిహారం ఇవ్వాలని బాదితుడు కోరాడు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పోలీస్ స్టేషన్‌ను గురువారం బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులతో పాటు సిబ్బంది విధుల గురించి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బందికి తగు సూచనలు చేసి ప్రజలకు సత్వరమైన న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి పోలీసులపై నమ్మకం పెంచాలన్నారు.